


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com

శనివారం | 27 జనవరి 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 93

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయనం - హేమంత ఋతువు, మార్గశిర మాసం శుద్ధ చతుర్దశి రా.9.26, పునర్వసు పూర్తి వర్జ్యం రా.7.06 నుండి 8.48 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు, దుర్ముహూర్తం ఉ.11.48 నుంచి 12.32 వరకు

## ఘనంగా గణతంత్ర వేడుకలు

### కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి



● రిపబ్లిక్ డే వేడుకల్లో రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ● నేడు అత్యంత ఘనంగా భారత రిపబ్లిక్ డే వేడుకలు ● ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ● ఆరు గుర్రాలు పూన్చిన వాహనంలో వచ్చిన ముర్ము, మేక్రాన్ ● గణతంత్ర పరేడ్‌ను నడిపించిన నారీమణులు ● గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో నారీశక్తి వెల్లివిరిసింది ● దేశ సైనిక శక్తిని చాటిన త్రివిధ దళాల ప్రదర్శనలు

భారత రిపబ్లిక్ డే వేడుకలు శుక్రవారం దేశమంతా ఘనంగా జరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ లో గణతంత్ర ఉత్సవం అంబరాన్నంటింది. కర్తవ్యపథ్‌లో దేశ ప్రథమ మహిళ ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు తదితరులు హాజరయ్యారు.


6 లో

## టీఎస్‌లో నియంతృత్వం పోయింది


2 లో

● హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జాతీయ జెండా ఆవిష్కరణ ● ప్రజలను ఉద్దేశించి ప్రసంగం ● విధ్వంసానికి గురైన వ్యవస్థల్ని పునర్నిర్మించుకుందామని పిలుపు ● సంక్షేమంలో తమ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని వ్యాఖ్య

## అవునన్నా.. కాదన్నా నేను వైఎస్ షర్మిలనే


2 లో

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనకు ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనకు చాలా తేడా ఉందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు.ఏపీసీసీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు.

## రేపు తెలంగాణకు కేంద్రమంత్రి అమిత్ షా


2 లో

● రేపు మధ్యాహ్నం 1.05 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేటకు అమిత్ షా ● మహబూబ్ నగర్‌లో జరగనున్న పార్టీ క్లస్టర్ సమావేశంలో పాల్గొననున్న కేంద్రమంత్రి ● ఆ తర్వాత కరీంనగర్ కార్యకర్తల సమావేశానికి హాజరు

## ఊసరవెల్లిని మించిన నితీష్ రాజకీయం

● మళ్లీ బీజేపీతో కలిసి సర్కారు ఏర్పాటుకు సంకేతాలు ● సీఎం పదవిలో నితీష్‌ని నిలిపేందుకు కమలనాథులు సై


6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత

● ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ● గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ● సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ భారతి ● గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అలరించిన అలంకృత శకటాలు


2 లో

## ముఖ్యమంత్రి పచ్చజెండా

● పట్టాలెక్కనున్న పనులు ● మెట్రోపై స్పష్టతనిచ్చిన ప్రభుత్వం


వివరాలు-3లో

## సమసమాజ నిర్మాణానికి పునరంకితమవుదాం



ఉండవల్లి: దేశ ప్రజలందరికీ తెలుగుదేశం అధినేత చంద్రబాబు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ వంటి మహనీయుల ఆదర్శాలు, ఆకాంక్షల నుంచి మన రాజ్యాంగం ఊపిరి పోసుకుందన్నారు. ఈ శుభవేళ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు, సమసమాజ నిర్మాణానికి, పేదరిక నిర్మూలనకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను చంద్రబాబు ఎగురవేశారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు.హైదరాబాద్‌లోని నివాసంలో నిర్వహించిన వేడుకల్లో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్నారు.

## అంతా ఇంతే!



...తిట్లు రెడీ సార్

## పార్లమెంటులో తెలంగాణ గళం

● ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం ● క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలంగా ఉంది, ఎవరితోనూ సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదామని వ్యాఖ్య ● విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచన


6 లో

తెలంగాణ హక్కులకోసం పోరాడే దళం బిఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని, రాబోయే పార్లమెంటు సమావేశాల్లో బిఆర్ఎస్ ఎంపీలు తెలంగాణ హక్కుల సాధన కోసం గళం విప్పాలని బీఆర్ఎస్ అధినేత పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

## కాళేశ్వరంపై హైకోర్టులో సీబీఐ కౌంటర్ దాఖలు

● నిర్మాణంలోని అక్రమాలపై దర్యాప్తుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం ● విచారణ 2కు వాయిదా వేసిన న్యాయస్థానం


3 లో

కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తుపై సీబీఐ అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలోని అక్రమాలపై దర్యాప్తుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఆదేశిస్తే దర్యాప్తు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. దర్యాప్తునకు అవసరమైన వనరులు, సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలన్నారు. అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 4గురు ఎస్ఐలతో పాటు సిబ్బంది కావాలన్నారు. సీబీఐ అధికారుల కౌంటర్‌ను పరిశీలించిన న్యాయస్థానం ఫిబ్రవరి 2న మరోసారి విచారణ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణ ఆరోజుకు వాయిదా వేసింది.

## సూర్యలో గణతంత్ర వేడుకలు



సూర్య ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా వేడుకలు పాల్గొన్న డైరెక్టర్ రాంచందర్‌రావు, సీఎండి రాంబాబు, హెచ్ఆర్ నాగభూషణ రావు, నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ భాస్కర్, తెలంగాణ బ్యూరో వీరాంజనేయులు, సిబ్బంది హాజరయ్యారు.

## వైభవంగా విశాఖ బీచ్‌లో జీవీఎల్ రిపబ్లిక్ ఉత్సవం



విశాఖపట్నం, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖపట్నం ఆర్కే బీచ్ లో రిపబ్లిక్ డే సందర్భంగా బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహా రావు అధ్వర్యంలో నిర్వహించిన జీవీఎల్ రిపబ్లిక్ డే ఉత్సవం ఘనంగా జరిగింది. సుమారు 3వేల మంది యువతీ యువకులతో శుక్రవారం బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు వైబ్రంట్ వైజాగ్ కోసం 400 మీటర్ల పొడవైన జాతీయ జండాతో కలర్స్ వాక్ అత్యంత వైభవంగా జరిపారు. నాలుగు వందల మీటర్ల జాతీయ జెండా భూ సమాంతర ఆవిష్కరణతో రిపబ్లిక్ డే ఉత్సవం ఆయన ప్రారంభించారు. కేరింతలు కొడుతూ జాతీయ గీతాలు పాడుతూ వందే భారత్ నినాదాలతో యువతరం అంతా ఆ జెండాను సముద్రవు ఒడ్డున ఆకాశం దిశగా చూపుతూ ఇసుకలో కిలోమీటరు దూరం నడుస్తూ నినదించారు. ఉదయం ఆరు గంటల నుండే బీచ్ లో వేలాది నగర వాసులు, విద్యార్థులు క్రమశిక్షణతో జీవీఎల్ రిపబ్లిక్ ఉత్సవంలో పాల్గొని త్రివర్ణ పతాక రంగుల టీషర్టులు ధరించి సముద్ర తీరాన్ని జాతీయ వేదికగా ఆలరింపజేశారు. ఉత్సవ్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది అక్కడ పంచబడిన జీవీఎల్ 4 వైజాగ్ జెండా రంగు టీ షర్టులు ధరించి జెండా వందనం చేశారు. తొలుత జాతీయ గీతాలాపనతో వేదిక ప్రారంభం కాగా, బాల బాలికలు జెండాలు పట్టుకుని వందే మాతరం పాడుతూ నృత్యం చేశారు. ఎంపీ జీవీఎల్ దంపతులు కూడా వారితో కలిసి మొత్తం సభికులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా జీవీఎల్ అందరికీ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత



● ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ● గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ● సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ భారతి ● గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అలరించిన అలంకృత శకటాలు

విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకతని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగురవేశారు. ఈ



సందర్భంగా సాయుధ దళాల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులకు స్మరించుకున్నారు. ప్రజల సహకారంతో సమస్యలు అధిగమించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని.. కుల, మత రాజకీయ వివక్ష లేకుండా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామ స్వరాజ్యం దిశగా సంస్కరణలు అమలు చేశామని వివరించారు. కార్యక్రమంలో సీఎం జగన్ దంపతులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అలరించిన అలంకృత శకటాలు : రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 12 అలంకృత శకటాలు తమ తమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించాయి. ఉత్తమ శకటాల ఎంపికై సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, ఆంధ్ర లయోలా కళాశాల అధ్యాపకులు డాక్టర్ మొవ్వ శ్రీనివాస్ రెడ్డి, పురపాలక శాఖ విశ్రాంత డిఈ జెట్టి రామకృష్ణ మోహనరావు లు న్యాయ నిర్ణేతలు గా వ్యవహరించారు. ఇక విద్యాశాఖ, వైయస్సార్ ఆరోగ్యశ్రీ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ ల శకటాలకు వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు లభించాయి.

రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆయా శాఖల మంత్రులు ఉన్నతాధికారులను అభినందిస్తూ అవార్డులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, డిజిపి కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా తాతా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి విజయ్ కుమార్ రెడ్డిల నేతృత్వంలో అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పోతుల కిరణ్ కుమార్, టి కస్తూరి భాయ్, సూపరింటెండెంట్ బి గోవింద నాయక్, డిడి తిమ్మప్ప ఇతర అధికారులు వారి సిబ్బంది వేడుకలను పర్యవేక్షించారు.

## రాజ్యాంగ కర్తల బాటలో నడిచి దేశ అభ్యున్నతికి కృషి చేద్దాం



విజయవాడ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. స్వతంత్ర భారతావనిని గణతంత్ర రాజ్యంగా మార్చింది రాజ్యాంగం అని పేర్కొన్నారు. ఈరోజు మన రాజ్యాంగ కర్తలను స్మరించుకుందామని, రాజ్యాంగ కర్తల బాటలో నడిచి దేశ అభ్యున్నతికి కృషి చేద్దామని సీఎం పిలుపునిచ్చారు. డా. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తోందని వైసీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. స్వతంత్ర భారతావనిని గణతంత్ర రాజ్యంగా మార్చింది రాజ్యాంగం. ఆ పవిత్ర గ్రంథ రూపకర్తలను అనుక్షణం స్మరించుకుంటూ మన ప్రభుత్వంలో వారి గౌరవార్థం పలు కార్యక్రమాలు నిర్వహించాం. ఇందులో భాగంగా విజయవాడలో అంబేద్కర్ స్మృతివనంతో పాటు ప్రపంచంలోనే అతి పెద్దదైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. అందరికీ గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు అని ఏపీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఆనాడు ఆయన వేసిన బీజం ఎంత దృఢమైనదో అర్థమవుతుంది. భారత రాజ్యాంగం పవిత్రమైన గ్రంథం. దేశ సమగ్రతకు భంగం కలగకుండా రాజ్యాంగం కాపాడుతోంది. ఎన్నికల ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఏర్పడాలని రాజ్యాంగంలో రూపొందించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం బలంగా వేళ్లూనింది. ఐరోపా దేశాల్లో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతోంది.

## ఎవరు అవునన్నా.. కాదన్నా నేను వైఎస్ షర్మిలా రెడ్డినే



విజయవాడ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనకు ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనకు చాలా తేడా ఉందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. ఏపీసీసీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ఆర్ పాలనకు జగన్ పాలనకు భూమికి, ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది. జలయజ్ఞంపై వైఎస్ఆర్ ఎంతో దృష్టి పెట్టారు. ఆయన 17 శాతం నిధులిస్తే.. జగన్ 2.5 శాతమే ఖర్చు చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేదు. రాజధాని, ప్రత్యేక హోదా లేదు.. ఉన్నవన్నీ అప్పులే. ఒక్క సీటూ లేని భాజపా రాష్ట్రాన్ని శాసిస్తోంది. ఆ పార్టీకి వైసీపీ నేతలు కట్టుబానిసలు. స్వలాభం కోసం రాష్ట్రాన్నే తాకట్టు పెట్టారు. 25 మంది ఎంపీలున్నా తెచ్చింది గుండు సున్నా. పులి కడుపున పులే పుడుతుంది. నాది వైఎస్ఆర్ రక్తం. ఎవరు అవునన్నా.. కాదన్నా నేను వైఎస్ షర్మిలారెడ్డినే అని ఆమె వ్యాఖ్యానించారు.

# భారత రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం

● మన రాజ్యాంగం చాలా పటిష్ఠమైనది ● చట్టబద్ధంగా సవరణలు చేసుకుంటూ భావితరాలకు అందించాలి
● గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా మార్పులు చేర్పులు సవరణలు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థని మరింత పటిష్టం చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడిందని వైఎస్ఆర్సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం వందన సమర్పణ చేశారు. అనంతరం ఆయన ఈ కర్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు, మేధావులు, అంబేద్కర్ లాంటి మహనీయుల మార్గదర్శకత్వంలో రూపొందిన రాజ్యాంగం మన భారత రాజ్యాంగం. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుండి ఇప్పటికీ మార్గదర్శకముగా నిలబడి ఉందని ఆయన చెప్పారు.. తరువాత కాలక్రమేనా రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా మార్పులు చేర్పులు సవరణలు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థని మరింత పటిష్టం చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. భారత రాజ్యాంగం ఒక పవిత్రమైన గ్రంథం. దాన్ని అంత పటిష్టంగా రూపొందించారు కనుకనే ఈరోజు కూడా దేశ సమగ్రతకు భంగం ఏమాత్రం కలగకుండా కొనసాగుతోందని అన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ, ఏ కూటమి అధికారంలోకి వచ్చినా, ఎటువంటి దుష్ట శక్తులు, శత్రువులు ఎవరూ ఏమీ చేయలేని విధంగా మన రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు జరుగుతోందని తెలిపారు. ఎన్నికల ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఏర్పడాలన్న విధానానికి ప్రాతిపదికగా ఈ రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. మన రాజ్యాంగం వల్ల స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల జరుగుతూ ప్రభుత్వాలు మారుతున్నాయని కొనియాడారు.. ఎంతటి కుటుంబాలైనా, ఎంతటి కుటుంబమైన ఏకపక్షానికి అవకాశం లేకుండా ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా చట్టసభలకు వెళ్లే విధంగా రాజ్యాంగ వ్యవస్థ రూపొందించడం అభిలషలనీయమన్నారు.

మన పక్క దేశం పాకిస్తాన్తో పోల్చి చూస్తే మన రాజ్యాంగం గొప్పదనం ఎటువంటిదో అర్థమవుతుందన్నారు.

మన దేశంలో ఉన్నంత పటిష్టంగా రాజ్యాంగం పాకిస్తాన్ లో లేదని చెప్పారు. రాజ్యాంగాన్ని రూపొందించిన స్వాతంత్ర్య సమరయోధులు, నాయకులు,మేధావులు, బీ,ఆర్ అంబేద్కర్ లాంటి వారు మనకి



మార్గదర్శకులుగా,వీరంతా చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. ఈ రాజ్యాంగాన్ని అవసరమైన విధంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ దాన్ని చట్టబద్ధంగా సవరణలు చేసుకుంటూ భావితరాలకు ఈ రాజ్యాంగాన్ని అందించాలన్న అంశాన్ని గుర్తుపెట్టుకుని, అన్ని రాజకీయ పార్టీలు కూడా నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రామచంద్రారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రవిచంద్ర రెడ్డి, అంకంరెడ్డి నారాయణమూర్తి, కాకుమాను రాజశేఖర్, పలువురు కార్పోరేషన్ ఛైర్మన్లు,డైరక్టర్లు, పార్టీనేతలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు తెలంగాణకు కేంద్రమంత్రి అమిత్ షా



తెలంగాణ బ్యూరోప్రతినిధిఃకేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 28న తెలంగాణకు రానున్నారు. మరికొన్ని నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయి. లోక్ సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశనం చేయనున్నారు. అమిత్ షా ఎల్లుండి మధ్యాహ్నం 1.05 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. తెలంగాణ బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నేరుగా మహబూబ్ నగర్‌లో నిర్వహించనున్న పార్టీ క్లస్టర్ సమావేశానికి హాజరవుతారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీ గెలుపుపై శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు.అక్కడ సమావేశం పూర్తయ్యాక... హెలికాప్టర్‌లో సాయంత్రం 3.55 గంటలకు కరీంనగర్ వెళతారు. కార్యకర్తల సమావేశంలో పాల్గొని... అటు నుంచి హైదరాబాద్ బయలుదేరుతారు. సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో పార్టీ నిర్వహించే మేధావుల సమావేశానికి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సమావేశంలో పార్టీ మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై సలహాలు, సూచనలను స్వీకరిస్తారు. ఈ సమావేశం అనంతరం రాత్రి 7.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి పయనమవుతారు. ఆయన తెలంగాణలో దాదాపు 7 గంటల పాటు వుంటారు.

# 2024లో జగన్ ప్రభుత్వం కనబడకూడదు



● ఆయన ముఖ్యమంత్రి కాదు మద్యం వ్యాపారి ● జగన్ మాటలకీ చేతలకీ పొంతన ఉండదు ● అలాంటి వ్యక్తి తిరిగి అధికారం చేపట్టరాదు ● వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన - టీడీపీ ప్రభుత్వాన్ని స్థాపిస్తాం ● ఒక మాట అటూ ఇటూ అయినా పొత్తులోనే ముందుకు వెళ్తాం ● రాజోలు, రాజానగరం శాసనసభ స్థానాల్లో జనసేన అభ్యర్థులు ● రిపబ్లిక్ డే సందర్భంగా రెండు స్థానాల ప్రకటన ● మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్

గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సరే రానున్న సార్వత్రిక ఎన్నికల తరవాత జగన్ నడిపించే ఈ ప్రభుత్వం కనబడకూడదు. జగన్ విధానాలు, ధోరణి ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నాయి. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిచాడు. కనీసం విమర్శను కూడా స్వీకరించలేని వ్యక్తి. అలాంటి వ్యక్తి తిరిగి అధికారం చేపట్టకూడదని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. జనసేన – తెలుగుదేశం ప్రభుత్వం పాలనలోకి వస్తుందన్నారు. ఒక మాట అటు ఇటు అయినా టీడీపీతో పొత్తులోనే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కేవలం ఎమ్మెల్యే సీట్ల దగ్గర ఆగిపోమని, స్థానిక సంస్థల ఎన్నికల వరకూ ఇరు పార్టీలు కలిసే ముందుకు వెళ్తామని అన్నారు. రిపబ్లిక్ డేని పురస్కరించుకుని రాజోలు, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్టు ప్రకటించారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అభిప్రాయం చెప్పే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. జగన్ ప్రభుత్వంలో మాట్లాడకూడదు అంటారు? తిట్లు భరించడం, విమర్శలు స్వీకరించగలగడం నాయకుడి లక్షణం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి కాస్త ఎక్కువ తీసుకోగలగాలి. తనకు ఎవరూ ఎదురు తిరగకూడదు, మాట్లాడకూడదు అంటే ఇది రాజరికం కాదు ప్రజాస్వామ్యం. జగన్ స్వామ్యం అసలే కాదు. దాష్టీకాలు మితిమీరితే ప్రజలు ఎదురుతిరుగుతారు. వినాలి భరించాలి. ప్రజలు పద్దతులు మార్చుకోమని చెబితే మార్చుకోవాలి. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసినవారిని ఊరేగిస్తారు ఒక్క ప్రెస్ మీట్ పెట్టలేని వ్యక్తి ఈ ముఖ్యమంత్రి. సగటు మహిళ ఒకరు ముఖ్యమంత్రిని కలవడానికి వస్తే.. నిరసనకారులతో కలిపి అరెస్టు చేసి హత్యాయత్నం కేసు పెట్టేశారు. ఈ ప్రభుత్వంలో జరిగే దాష్టీకాలు ఎలా ఉంటాయంటే ఒక వైపు అంబేద్కర్ గారి విగ్రహం పెడతారు. ఇంకో వైపు దళిత వ్యక్తిని చంపి ఇంటికి ప్యాక్ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారు. చేతలకీ మాటలకీ పొంతనే ఉండదు. ఈ ప్రభుత్వంలో దళితులకు సంబంధించిన 23 పథకాలు తీసేశారు. అంబేద్కర్ గారి విగ్రహం పెట్టి దళితుల పథకాలు తీసేయడం వల్ల ప్రయోజనం ఏంటి? డాక్టర్ సుధాకర్ కోవిడ్ సమయంలో మాస్కులు లేవని చెప్పినందుకు పిచ్చోడిని చేసి చంపేశారు. దేశంలోనే దళితులపై అత్యధిక దాడులు జరిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఎక్కువ అట్రాసిటీ కేసులు పెట్టిన రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశే. ఇలాంటి పరిస్థితుల వల్లే బీసీల రక్షణకి ప్రత్యేక చట్టం కావాలనే అంశం తెరమీదకు వచ్చింది. జగన్ అనే ఈ వ్యక్తి మాటిస్తాడు ఏదీ నిలబెట్టుకోడు. మద్యపాన నిషేధం విధిస్తానని అధికారంలోకి వచ్చిన వ్యక్తి మద్యం వ్యాపారి అయిపోయాడు. ఈయన ముఖ్యమంత్రో మద్యం వ్యాపారో అర్థం కాని పరిస్థితి. రాష్ట్రంలో 30 వేల మంది ఆడ పిల్లలు అదృశ్యం అయిపోయారు. కనీసం ఎందుకు అదృశ్యమయ్యారన్న వివరణ కూడా ఇవ్వరు. అకారణంగా కేసులు పెట్టి జైల్లో పెట్టించడం, బెదిరించడం మాత్రమే చేస్తారు.

**ప్రత్యేక పరిస్థితులు ఉంటాయి..అర్థం చేసుకోవాలి :** మండపేట నియోజకవర్గం నుంచి కొంత మంది నాయకులు వచ్చి నన్ను కలిశారు. పొత్తు ధర్మం పాటించకుండా చంద్రబాబు మండపేట అసెంబ్లీ సీటును ప్రకటించేశారని బాధపడ్డారు. వారి మాటలతో నేను ఏకీభవించి, ఇలా జరిగి ఉండకూడదని క్షమాపణలు చెప్పాను. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు. ఆయనకు ప్రత్యేక పరిస్థితులు ఉండి ఉంటాయి. గబుక్కున్న ఒక మాట అనేలా చేస్తుంది. అది మనం అర్థం చేసుకోవాలి. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులు వేరుగా ఉంటాయి. మొన్నటికి మొన్న లోకేష్ మా నాన్న గారే ముఖ్యమంత్రి అని మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నేను పెద్ద మనసుతో స్పందించలేదు. వాళ్లు పొత్తు ధర్మం మరిచిపోయి మాట్లాడుతున్నారు. మీరు కూడా మాట్లాడొచ్చు కదా అని కొంతమంది మాట్లాడుతున్నారు. పొత్తును ఇబ్బందికి గురి చేసేలా మాట్లాడం చాలా తేలిక. నిలబెట్టడం చాలా కష్టం. జగన్ సొంత చెల్లినే వదల్లేదు జనసేన ఎందుకు సింగిల్ గా వెళ్ల కూడదు అన్న ప్రశ్న కొంత మంది నుంచి తలెత్తింది. మనం బలాన్ని ఇచ్చే వాళ్లమవుతున్నాం, తీసుకునేవాళ్లం అవడం లేదనీ, 53 స్థానాలు తీసుకోవాలి, 70 స్థానాలు తీసుకోవాలని కొంత మంది చెప్పారు. ఇవాళ నాకు సలహాలు చెప్పే వారు 2019 సార్వత్రిక ఎన్నికల్లో 153 స్థానాల్లో జనసేన అభ్యర్థులను బరిలో నిలిపితే కనీసం 30–40 స్థానాల్లో గెలిపించలేక పోయారు. కనీసం నన్ను కూడా గెలిపించలేకపోయారు. ఆ రోజు గెలిపించి ఉంటే ఈ రోజు మాట్లాడడానికి సంపూర్ణంగా హక్కు ఉండేది. మనం ఒంటరిగా వెళ్తే కచ్చితంగా కొన్ని సీట్లు సాధిస్తాం. ప్రభుత్వంలో అడుగుపెడతామో లేదో తెలియదు. జగన్ అనే వ్యక్తి సొంత చెల్లినే వదలని వాడు. మనల్ని ఎలా వదులుతాడు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు కూడా నా సలహా ఏంటంటే ఊరంతా శత్రువుల్ని పెట్టుకున్న నాయకుడి వెంట మీరు నడుస్తున్నారు. వైసీపీ నాయకులు జాగ్రత్తపడాలి. రేపు మీకు కష్టం వస్తే మళ్లీ పవన్ కళ్యాణ్ దగ్గరకే రావాలని గుర్తుపెట్టుకోండి. కక్షపూరితంగా ఉంటే సమాజం విడిపోతుంది. అందుకే నన్ను తిట్టినా భరించి ముందుకు వెళ్తున్నాం. ప్రజలు బాగుండాలి. కక్షలు పెట్టుకుంటే విధ్వంసం తప్ప నిర్మాణం ఉండదన్న ఉద్దేశంతోనే అన్నింటినీ భరిస్తా.

**రాష్ట్ర భవిష్యత్తే ఇరు పార్టీల ఉమ్మడి కార్యాచరణ :** టీడీపీతో పొత్తు విషయానికి వస్తే ఒక మాట ఎక్కువ తక్కువ ఉండవచ్చు. పై స్థాయి నాయకులు మాట్లాడే మాటల వల్ల కింద స్థాయిలో కొంచం ఇబ్బందికర పరిస్థితులు ఉండవచ్చు. పొత్తులో కొన్ని ఆటుపోట్లు తప్పవు.. భరించాలి. మనందరికీ కావాల్సింది ప్రజా సంక్షేమం. ప్రజలకు ఎలాంటి భవిష్యత్తు చూపాలన్నదే ఉమ్మడి కార్యాచరణగా ఉంటుంది. ఉమ్మడి రాజకీయ కార్యాచరణలో స్థానిక సంస్థల నుంచి కార్పోరేషన్ల వరకు జనసేన మూడో వంతు సీట్లు తీసుకుంటుంది. కనీసం మూడో వంతు మనం వార్డు మెంబర్లుగా ఉండాలి.

## ఓటు బ్యాంక్‌పైనే షర్మిల దృష్టి

అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిలా రెడ్డి మొదటి టార్గెట్ ను డిసైడ్ చేసుకున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు గెలవకపోయినా ప్రభావవంతమైన పార్టీగా గుర్తించేలా ఓటు బ్యాంక్ తెచ్చుకోవాలన్న లక్ష్యంతో ఉన్నారు. ఈ విషయంలో ఆమె చాలా స్పష్టతతోనే రాజకీయాలు చేస్తున్నారని తొలి ప్రసంగం చూస్తేనే అర్థమవుతుందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఆదరించి ముస్లిం, దళిత వర్గాలను ఆకట్టుకునేందుకు షర్మిల మొదటి స్పీచ్ లోనే ప్రయత్నాలు చేశారు. టీడీపీ, వైసీపీ రెండూ బీజేపీకి దగ్గరని చెప్పడమే కాకుండా మణిపూర్ చర్చిలపై జరిగిన దాడుల విషయంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ని ప్రత్యేకంగా టార్గెట్ చేశారు. ఈ కారణంగానే వైఎస్ఆర్‌సీపీ ఉలిక్కి పడిందని అర్థం చేసుకోవచ్చు.

ఓటర్లను కాంగ్రెస్ వైపు రప్పించే వ్యూహం : పదిశాతానికిపైగా ఓట్లను సాధించుకుంటే కాంగ్రెస్ పార్టీ ఏపీలో ట్రాక్‌లోకి వచ్చినట్లే. అంతే కాదు షర్మిల నాయకత్వం బలంగా మారుతుంది. అందుకు బాగా దగ్గరగా ఉండే దారి ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లను ఆకర్షించడం. సీఎం జగన్ సొంత పార్టీ పెట్టుకునే వరకూ ఏపీలో ముస్లిం, దళిత వర్గాలన్నీ కాంగ్రెస్ ను అంటి పెట్టుకుని ఉన్నాయి. తర్వాత పూర్తిగా వైసీపీ వైపు మళ్లాయి. ఇప్పుడు ఆ ఓటర్లను వెనక్కి రప్పించుకోవడం సులువు అన్న ఉద్దేశంతో షర్మిల ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆమె ఈ రెండు వర్గాలకు కాంగ్రెస్ మాత్రమే రక్ష అన్నట్లుగా ప్రసగించారు. సీఎం జగన్ స్వయంగా క్రైస్తవుడు అయినప్పటికీ ఆయన మణిపూర్ లో చర్చిలపై జరిగిన దాడుల్ని ఖండించలేదని విమర్శించి సంచలనం రేపారు. నిజానికి మణిపూర్ అంశం ఏపీ రాజకీయాల్లో ఎప్పుడూ చర్చకు రాలేదు.

ఘోర యుద్ధం జరుగుతున్న ఇజ్రాయెల్లో వేలాది మంది భారతీయ కార్మికులు ఉద్యోగాల కోసం రికట్ అవుతున్నారు. జనవరి 16న, రోహ్తక్లో రికట్మెంట్ డ్రైవ్ ప్రారంభించబడింది. అంతకుముందు,డిసెంబర్ 2023లో, హర్యానా మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో నిరుద్యోగ అభ్యర్థులను ఇంటర్వ్యూలు మరియు జాబ్ స్క్రీనింగ్లకు రావాలని నోటిఫికేషన్లు జారీ చేశాయి.హర్యానా ప్రభుత్వ ప్రకటనలు ఇజ్రాయెల్లో కార్పెంటర్లు, ఐరన్ బెండర్లు, సిరామిక్ టైల్స్ ఫిక్సర్లు మరియు మేసన్లు వంటి 10,000 స్థానాలను భర్తీ చేయాలని అభ్యర్థులకు ప్రత్యేకంగా పిలువునిచ్చాయి.పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ యుద్ధం చేస్తున్న తరుణంలో ఈ రికట్మెంట్ డ్రైవ్ జరుగుతోంది.100 రోజులకు పైగా సాగిన ఈ యుద్ధంలో, కనీసం 25,000 మంది పాలస్తీనియన్

## భారత కార్మికులను ఇజ్రాయెల్‌కు పంపొద్దు

ప్రజలు ఇప్పటికే మరణించారు, వారిలో ఎక్కువ మంది మహిళలు మరియు పిల్లలు ఉన్నారు.

కర్మాగారాలు, నిర్మాణ స్థలాలు మరియు ఆసుపత్రులలో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికులను భారతదేశం మరియు ఇతర దేశాలకు చెందిన వ్యక్తులతో భర్తీ చేయడానికి ఇజ్రాయెల్ దీర్ఘకాలిక విధానాన్ని అనుసరిస్తోంది.ఈ విధానంలో భాగంగా, మే 9,2023న,ఇజ్రాయెల్ ప్రభుత్వం 42,000 మంది భారతీయ కార్మికులు ఇజ్రాయెల్లో పనిచేయడానికి అనుమతించే ఒక ఒప్పందంపై సంతకం చేసింది, ఇందులో 34000 మంది నిర్మాణ మరియు నర్సింగ్ రంగాలలో పనిచేస్తున్నారని అంచనా.అక్టోబర్లో జరిగిన యుద్ధంతో ఈ ఒప్పందం అమలు తాత్కాలికంగా నిలిచిపోయింది.నవంబర్ 2023లో భారతదేశం యొక్క నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ భారతీయ నిర్మాణ మరియు నర్సింగ్ కార్మికులను తాత్కాలిక ఒప్పందాలపై ఇజ్రాయెల్లో నియమించడానికి మూడు సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు నివేదించబడింది.రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టే ప్రకటనలను ఈ ఒప్పందం వెలుగులో చూడాలి.

రికట్ అవుతున్న కార్మికులకు వారి పని విధానాలు,వారి భద్రత రికట్మెంట్ను నిర్వహిస్తున్న భారతదేశ ఒప్పందం గురించి ఎటువంటి సమాచారం లేదు.కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇజ్రాయెల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానించాయి మరియు కార్మికులకు నైపుణ్య శిక్షణ అందించడమే మాకు ఉన్న ఆదేశం అని చెబుతున్నారు.ఈ నైపుణ్య శిక్షణ కోసం నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఒక్కో కార్మికుడి నుంచి రూ.10,000 వసూలు చేస్తోంది.ఈ అంశంపై కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తన వైఖరిని వివరించలేదు.

హర్యానా కార్మిక మంత్రి రికట్మెంట్కు సంబంధించిన అన్ని బాధ్యతలను తిరస్కరించారు, అటువంటి కార్మికుల వలసలను పర్యవేక్షిస్తున్న కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖదే అని చెప్పారు. ఇజ్రాయెల్ లేబర్ ఏజెన్సీ వారు వలస కార్మికులకు ఎలాంటి హామీలు ఇచ్చారో తెలియుటలేదు .ఈ కార్మికులకు ఎవరు బాధ్యులని స్పష్టం చేయడానికి విదేశీ వ్యవహారాల శాఖ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు.భారతీయ కార్మికులు ఎదుర్కొంటున్న జీవనోపాధి,అభద్రత, విదేశాలలో అత్యంత ప్రమాదకరమైన మరియు తాత్కాలిక ఉపాధికి వారిని ఆకర్షించడానికి ఉపయోగించబడుతోంది. అధికారులు – కేంద్రంలోని విదేశీ వ్యవహారాల శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలు – తమ బాధ్యతను గుర్తించి, కార్మికుల భద్రతకు జవాబుదారీగా ఉండేందుకు సిద్ధంగా లేరన్నది తీవ్ర ఆందోళన కలిగించే విషయం.అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ,ఈ నియామకాలను నిలిపివేయాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ అనూహ్యమైన నేరాలకు పాల్పడుతున్న తరుణంలో భారత ప్రభుత్వం ఇజ్రాయెల్కు కార్మికులను పంపకూడదు.

# మాల్దీవులతో వ్యూహాత్మక సంబంధాల కొనసాగింపు కూడా ముఖ్యమే!

**● మన లక్షద్వీప్ సహజ అందాలు, బీచ్‌లు పర్యాటకులకు స్వర్గధామం అనటం తప్పెలా అవుతుంది ● స్కూబా డైవింగ్, బీచ్‌ల అందాలను ఆవిష్కరించేలా ప్రధాని మోడీ వీడియోలు ● పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధికి సన్నాహాలు చేయాలని సూచనలు ● ప్రధాని మోడీ లక్షద్వీప్‌ని ప్రమోట్ చేయటాన్ని తప్పుపట్టిన మాల్దీవ్ ప్రధాని ● మన ప్రధానిపై సెటైర్లు వేసిన మాల్దీవ్ మంత్రులు ● వారిపై చర్యలు తీసుకున్నా ఆగని మాటల యుద్ధం**




డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రపంచ దేశాల్లో 2వ అతి చిన్న దేశమైన మాల్దీవుల ఆర్థిక వ్యవస్థలో మూడో వంతు పర్యాటక రంగం నుంచే వస్తున్నదని, గత ఏడాది మాల్దీవుల్లో పర్యటించిన విదేశీయుల్లో భారతీయులే అధికమని తెలుసుకోవాలి. హిందూ మహాసముద్రం మధ్యలో ఉన్న 1200 పగడపు దీవులతో మాలే రాజధాని అయిన మాల్దీవుల దేశంలో దాదాపు 6 లక్షల జనాభా మాత్రమే ఉన్నది. ఆహారం, మౌళిక సదుపాయాలు, నిర్మాణాలు, విద్య, వైద్యం టెక్నాలజీల కోసం పొరుగు దేశమైన భారత్ మీదనే ఆధారపడుతూ వస్తున్నది. దేశ ఆదాయంలో 80 శాతం వరకు టూరిజం ద్వారానే లభిస్తున్నది. 2022లో 2.41 లక్షల మంది, 2023లో 2 లక్షలకు పైగా భారతీయ పర్యాటకులు మాల్దీవులను సందర్శించారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి చిట్టి మాల్దీవుల ద్వీపాల సముదాయ సముద్ర తీరాల్లో వెయ్యికి పైగా రిసార్టులు నిర్మించడం జరిగింది. బీచ్ ప్రాంతాల్లో హోటల్స్, రిస్టారెంట్లు, వాటర్ స్పోర్ట్స్ సదుపాయాలు కల్పించడం కనీస బాధ్యతగా ప్రభుత్వాలు భావించాలి. కొద్ది రోజుల క్రితం మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షద్వీప్లో చేసిన పర్యటన సందర్భంగా లక్షద్వీప్ సహజ అందాలు, బీచ్లు పర్యాటకులకు స్వర్గధామం అంటూ స్కూబా డైవింగ్, బీచ్ల అందాలను ఆవిష్కరించే విధంగా కొన్ని ఆకర్షణీయ అద్భుత వీడియోలు, ఫోటోలను ఆన్లైన్లో షేర్ చేయడంతో పలువురు నెటిజెన్లు లక్షద్వీప్ను మల్దీవులతో పోల్చడం, మన దేశ అందాలను ఆస్వాదించే ఆన్లైన్లో ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఫోటోలను షేర్ చేస్తూ సాహసం ఇష్టపడే వారు ఎవరైనా కచ్చితంగా లక్షద్వీప్ చూడాల్సిందే అంటూ ప్రధాని మోదీ ఎక్స్ హ్యాండిల్లో రాస్తూ లక్షద్వీప్ పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పోస్ట్ చేశారు. ఈ విషయాలకు మాల్దీవుల మతిలేని మంత్రి మరియం షివుమా వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ మోదీని జోకర్ లేదా విదూషకుడిగా, టెర్రరిస్ట్, ఇజ్రాయిల్ చేతిలో కీలుబొమ్మ లేదా తోలుబొమ్మగా పేర్కొంటూ ట్వీట్లు చేశారు. అలాగే మాల్దీవుల మంత్రులు మజీద్, మల్షా, ఎంపీ జహీద్ రమీజ్లు కూడా ఇవే రకమైన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తూ భారత్లో హోటల్ గదులు అసహ్యంగా ఉంటాయని, మా దేశంతో లక్షద్వీప్కు పోలికేంటి ? అంటూ నోరు పారేసుకున్నారు. మాల్దీవులకు ఏటా భారీగా పర్యాటకులను పంపే భారత్పై అలా నోరు జారడం దారుణం అంటూ సర్వత్రా ఆగ్రహజ్వాలలు ఎగిసిపడడం చూసాం. ఈ అనుచిత వ్యాఖ్యలకు స్పందించిన భారత ప్రముఖులు, సినీ ప్రముఖులు,ప్రముఖ క్రీడాకారులు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, నెటిజెన్లు బాయ్కాట్ మాల్దీవ్స్ అంటూ ముక్తకంఠంతో పిలుపునివ్వడం, ప్లాన్ చేసుకున్న హాలీడే ట్రిప్పులను పలువురు రద్దు చేసుకోవడం లాంటివి కుక్క కాటుకు చెప్పు దెబ్బగా పని చేశాయి. దిద్దుబాటు చర్యలను చేపట్టిన మాల్దీవుల మయిజ్జూ ప్రభుత్వం ఈ వివాదస్పద ద్వేశపూరిత వ్యాఖ్యలు చేసిన మరియం షియునా, మల్షా, హసన్ జిహాన్ అనబడే ముగ్గురు నోరుజారిన మంత్రులను బర్తరఫ్/సస్పెండ్ చేసినప్పటికీ మాల్దీవుల పర్యాటకంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడడం ప్రారంభమైంది.

ఇప్పటి వరకు ఇండియన్ బీచ్ అందాలను ఆస్వాదించడానికి కొంతైనా ఆసక్తి చూపని భారత సూపర్ స్టార్స్ నేడు అందమైన భారత బీచ్లను ఆస్వాదించడానికి పూనుకోవడం దేశ పర్యాటకానికి శుభ పరిణామంగా అర్థం చేసుకోవాలి. ఎక్స్ప్లోర్ ఇండియన్ ఐలాండ్స్ అంటూ నినాదాలు మిన్నంటుతున్న వేళ దేశ పర్యాటకానికి ఊపిరులూదడం, దేశ ఆర్థికానికి ఊతం ఇచ్చే విధంగా మన ప్రభుత్వ పటిష్ట అడుగులు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. 5,000 వేల ఏండ్ల నాగరికత, సంస్కృతి, వైవిధ్య కల్చర్ కలిగిన సువిశాల భారతంలో పోర్టుల నుంచి జీవ నదుల వరకు, దేవాలయాల నుంచి చర్చిల వరకు, అందమైన హరిత అడవుల నుంచి వన్యప్రాణ వరకు, పాకశాస్త్రం నుంచి హస్తకళల అద్భుతాల వరకు, అమాయక పల్లెల నుంచి ఆధునిక మెట్రొపాలిటన్ మహానగరాల వరకు, అమాయక గ్రామీణ గుడిసెల నుంచి పట్టణాల్లోని ప్యాలేస్ల వరకు అనంత వైవిధ్యభరిత అందాలు కొలువైన కోవెలగా భారతం పర్యాటకులకు అందాల విందులు చేసే అన్ని అర్హతలను కలిగి ఉన్నది. భారత్కు 7,000 కిమీ సముద్ర తీరం, 1,000కి పైగా పోర్టులు ఉండడం మన ప్రత్యేకత. భారత్లో ఆంగ్లభాష మాట్లాడే ప్రజలు అనేకం కనిపించడంతో పాటు పర్యాటకులతో స్నేహపూరితంగా మసలుకునే స్వభావం మన రక్తంలోనే ప్రవహిస్తున్నది. ప్రతి ఏట విదేశాలకు 20 మిలియన్ల భారతీయ పర్యాటకులు వెళుతుండగా, మన దేశానికి 7 మిలియన్ల విదేశీ పర్యాటకుల మాత్రమే రావడం జరుగుతోంది. నేడు వందకు పైగా రైల్వే స్టేషన్లు, అనేక అత్యాధునిక ఎయిర్ పోర్టులు, సూపర్ హైవేలు అందుబాటులోకి వచ్చినప్పటికీ విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి మన విలక్షణ వైవిధ్యాలను పరిచయం చేయడానికి మరెంతో చేయాల్సి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నేడు ప్రపంచ దేశాల్లో పర్యాటకులను ఆకర్షించే ఉత్తమ దేశాల ట్రావెల్ అండ్ టూరిజం డెవెలప్మెంట్ ఇండెక్స్ జాబితాలో భారత్కు 54వ స్థానం లభించడం విచారకరం. భారత కేంద్ర ప్రభుత్వంలోని పర్యాటక మంత్రిత్వశాఖకు సాలీనా రూ: 2,400 కోట్లు బడ్జెట్ మాత్రమే కేటాయించడం మన ప్రాధాన్యాలను స్పష్టం చేస్తున్నది. యూపీ, పంజాబ్, తెలంగాణ, ఎంపీ, ఢిల్లీ రాష్ట్రాల ప్రచార ఖర్చు కూడా మన భారత పర్యాటక మంత్రిత్వ శాఖకు కేటాయించిన సొమ్ము కంటే అధికంగా ఉండడం సోచనీయం. కేరళ రాష్ట్ర ప్రభుత్వం గాడ్స్ ఓన్ కంట్రీ అనే నినాదంతో తన పర్యాటకాన్ని ప్రచారం చేసుకుంటున్నది. గుజరాత్ కూడా అమితాబచ్చన్ను పర్యాటక ప్రచారానికి వినియోగించుకోవడం కూడా సత్ఫలితాలను ఇస్తున్నది. అస్సాం, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు సినీ దిగ్గజాలైన అక్షయ్ కుమార్, ప్రియాంక చోప్రా, కంగనా రానౌట్లను వాడుకోవడం చూసాం. పరిస్థితులను అర్థం చేసుకున్న మన ప్రధాని మోదీ ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ తానే ప్రధాన ఆకర్షణగా మన పర్యాటకానికి ప్రచారం చేయడం ముదావహం. మన హిల్ స్టేషన్లను అర్బన్ స్లమ్ సెంటర్లా మార్చడం, పర్యాటక కేంద్రాల్లో రెస్టారెంట్లు నెలకొల్పడానికి 40కి పైగా ప్రభుత్వ అనుమతులు అవసరం కావడం, రైలు/రోడ్డు/ విమానయాన రవాణా సౌకర్యాలు కొరవడడం, అనారోగ్యాల నెలవులుగా పబ్లిక్ యుటిలిటీస్ ఉండడం, పరిసరాల అపరిశుభ్రతలు ఆహ్వానం పలకడం లాంటి సమస్యల వలయంలో మన దేశ పర్యాటకం విలవిల్లాడుతున్నది. సౌధీ అరేబియా, ఇండోనేషియా, ఓమన్, యూఏఈ లాంటి దేశాలు విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి అనేక సృజనశీల ప్రచారాలు చేయడం మనకు గుణపాఠం కావాలి. దుబాయ్, హాంకాంగ్, సింగపూర్, ఇస్తాంబుల్, అబుదాబి, కువైట్, ఓమన్, ఖతార్ లాంటి ప్రాంతాలకు భారత పర్యాటకుల క్యూ కట్టడం అనాదిగా జరుగుతోంది. ఇలాంటి దేశాలను స్ఫూర్తిగా తీసుకొని భారత దేశం తన పర్యాటక రంగానికి సత్వరమే మెరుగులు దిద్దాల్సి ఉంది. పర్యాటక పరిశ్రమతో దేశ ఆర్థికం కూడా ముడిపడి ఉందని మరిచిపోరాదు. ప్రపంచానికి యోగా, వ్యాక్సిన్స్, మిలిటరీ పవర్ లాంటివి ఎన్నో పరిచయం చేసిన భారతం నేడు అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా మారాలని ఆశిద్దాం.

గత నవంబర్లో అధ్యక్షుడిగా గెలిచిన మహమ్మద్ ముయిజ్జు ఇండియా అవుట్ అనే భారత వ్యతిరేక తీరును ప్రదర్శిస్తూ, గత కొన్నేళ్లుగా మాల్దీవుల్లో సేవలు అందిస్తున్న మన సైన్యాన్ని మార్చి 15, 2024 వరకు వెళ్లిపోవాలని కూడా తెలియజేస్తూ, గత రెండు దశాబ్దాలుగా చైనాకు దగ్గర కావడానికి అడుగులు వేయడం కూడా దేశ భద్రతకు మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తునారు. గత అర్థ శతాబ్దం పాటు భారత మిత్రుత్వ ప్రభుత్వాలు మాల్దీవుల్లో కొలువు కావడంతో భారత్ – మాల్దీవుల సంబంధాలు ఉన్నత స్థాయిలో కొనసాగాయి. అనేక చిన్న ద్వీపాలు కలిగిన మాల్దీవుల్లో 800 కిమీ మేరకు భౌగోళిక వ్యూహాత్మక స్థానంగా ఎకనమిక్ జోన్ ఉండడంతో పాటు ఇప్పటి వరకు మానవ ఆవాసాలు లేని 35కు పైగా ద్వీపాల్లో మిలిటరీ/ సివిల్ సంస్థాపనలకు అవకాశాలు ఉండడం మాల్దీవులకు కలిసి వచ్చిన అంశంగా అర్థం చేసుకోవాలి. శ్రీలంక మాదిరిగా మాల్దీవులు కూడా ఆర్థిక సహాయం కోరి చైనా గుప్పిట్లోకి చేరడం కూడా భారత భద్రతకు మంచిది కాదు. మాల్దీవులతో సంయమనం పాటిస్తూ పరిపక్వతతో కూడిన సంబంధాలను కొనసాగించడమే ఉత్తమమని సలహా ఇస్తున్నారు. మాల్దీవులతో వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి, దేశ భద్రతకు సత్సంబంధాలను కొనసాగించడానికి, ఇండియా వ్యతిరేక భావనలను తగ్గించడానికి భారత విదేశాంగశాఖ కృషి కొనసాగించాలి. భారత్తో వ్యతిరేక భావన కలిగిన మాల్దీవుల మొయిజ్జు ప్రభుత్వం ఉన్నంత వరకు సున్నితమైన అంతర్జాతీయ సంబంధాలను మాల్దీవులతో కొనసాగించడమే ఉత్తమ విధానమని తెలుసుకోవాలి.

భిన్నత్వంలో ఏకత్వం సాధించిన భారతంలో అపారమైన వైవిధ్యభరిత, ఆకర్షణీయ అందాల విందులు, బహువిధాల జీవనశైలిలు, సహజ అందాలు ఆరేసిన ప్రాంతాలు అనేకం ఉన్నాయి. మన సహజ వనరులు, చారిత్రక కట్టడాలు, కొండ కోనలు, డిజిటల్ వెలుగులు, మహానగరాల మహాద్భుత ఆకర్షణలు లాంటివి అనేకం విదేశీ పర్యాటకాలకు వీనుల విందులు, కళ్లకు పసందులు చేయాలని కోరుకుందాం. భవ్య భారత పర్యాటక క్షేత్రాలకు అవసర మెరుగు దిద్ది ప్రపంచ పర్యాటకుల స్వర్గధామంగా భారతాన్ని తీర్చిదిద్దుదాం. భారత్ అనాదిగా నమ్మిన అతిథి దేవోభవ(ది గెస్ట్ ఈజ్ గాడ్) అనే నినాదాన్ని మన పర్యాటకాభివృద్ధికి వినియోగించుకుంటూ, మాల్దీవులతోవ్యూహాత్మక సంబంధాలనుకొనసాగిస్తూ మనదేశ విలక్షణతలను విదేశీయులకు పరిచయం చేద్దాం.

# భారత రాజ్యాంగాన్ని కొత్తగా రాయడం సమంజసమేనా ?

**● దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేసి రాసిన మన రాజ్యాంగం ● రాజ్యాంగం రాయడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు ● రాజ్యాంగ రచనలో తోడ్పడ్డ 298 మంది ● భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన మన రాజ్యాంగ నిర్మాతలు ● 1949 నవంబర్ 26లో రాజ్యాంగ సభ ఆమోదం 1950 జనవరి నుండి అమలు**




డాక్టర్. ఎస్. విజయ భాస్కర్
9290826988

మన దేశానికి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యావాదులనుండి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని 1947 ఆగష్టు 15 నాడు పొందింది.భారత రత్న డాక్టర్.బి.ఆర్.అంభేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాణ పరిషత్ ఏర్పడింది.అనేక మంది మేధావులు అన్ని దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేసి అందులో నుండి మన దేశానికి అవసరమైన విషయాలు ప్రజాస్వామ్యం, ఎన్నికల విధానం, రిజర్వేషన్ విధానం,సవరణ, న్యాయవ్యవస్థ, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, రాష్ట్ర పతి, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి , స్పీకర్ ఎన్నికల విధానం, సుప్రీంకోర్టు , హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ,ఇతర న్యాయమూర్తుల ఎంపిక విధానం మొదలైన అనేక విషయాలు మన రాజ్యాంగం లో పొందపరచడం జరిగింది. రాజ్యాంగం రాయడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది.64లక్షల రూపాయల ఖర్చు అయ్యింది.298 మంది రాజ్యాంగ రచనలో తోడ్పడ్డారు.రాజ్యంగంలో 315 అధికరణలు,22 భాగాలు,9 షెడ్యూల్ లు ఉన్నాయి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో వ్యయ, ప్రయాసలతో రాజ్యాంగం పూర్తి చేసి ప్రపంచం లోనే అతి పెద్దదైన రాజ్యాంగంను రూపొందించారు. కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ, భాష, స్త్రీ, పురుష, వికలాంగుల, వృద్ధుల , కార్మిక, కర్షక , ఉద్యోగుల హక్కులనన్నింటిని రాజ్యాంగం లో రూపొందడం జరిగింది. రాజ్యాంగం 1949 నవంబర్ 26 రాజ్యాంగ సభ ఆమోదించింది 1950 జనవరి నుండి మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి రిపబ్లిక్ దినోత్సవంగా జరువుకుంటున్నాం. హిందువులకు దసరా, దీపావళి, సంక్రాంతి ముస్లిం లకు రంజాన్, బక్రీద్, క్రైస్తవులకు క్రిస్ మస్ లాగా జాతీయ పర్వ దినం గా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరువుకుంటున్నారు. మన దేశంలో కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ, భాష బేధం లేకుండా అందరూ కలిసి మెలిసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని, గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ పర్వదినాలుగా ఘనంగా నిర్వహించుకుంటున్నారు. రిపబ్లిక్ దినోత్సవానికి ( గణతంత్ర దినోత్సవానికి), స్వాతంత్ర్య దినోత్సవానికి తేడాలు రిపబ్లిక్ దినోత్సవం నాడు కేంద్రంలో రాష్ట్రపతి, రాష్ట్రాలలో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.స్వాతంత్ర్య దినోత్సవం నాడు కేంద్రంలో ప్రధాన మంత్రి, రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు.అన్ని రాష్ట్రాల శకటాల ప్రదర్శన ఉంటుంది. మూడు సంవత్సరాల తరువాత తెలంగాణ శకుటం గత మూడు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో నిర్వహించే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రదర్శించే శకట ప్రదర్శనలో తెలంగాణ శకటానికి స్థానం దక్కలేదు.మూడు సంవత్సరాల తర్వాత ఈ దఫా గణతంత్ర దినోత్సవ సంబరాల్లో తెలంగాణ శకటం ఆహుతులను అలరించనున్నది.

గణతంత్ర ( రిపబ్లిక్ దినోత్సవం), స్వాతంత్ర్య దినోత్సవం సెలవు దినాలా ?

గణతంత్ర ( రిపబ్లిక్ ) దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాలను సెలవు దినాలుగా భావిస్తున్నారు. గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాలను జాతీయ పర్వదినాలుగా పరిగణించాలి.కొన్ని ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు స్వాతంత్ర్య దినోత్సవాన్ని, గణతంత్ర దినోత్సవాన్ని సెలవు దినాలుగా ప్రకటిస్తున్నారు.చాలామంది విద్యార్థులకు జాతీయ పర్వదినాలైన స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం ప్రాధాన్యత తెలియడం లేదు. కొన్ని వ్యాపార వస్తువులను ,దేశ నాయకుల ఫోటోలు విక్రయించే దుకాణాల యాజమానులకు దేశ భక్తుల ఫోటోలు దొరకడం లేదు.గాంధీ మహాత్ముని ఫోటో కావాలని అడిగితే టోపీ కలిగిన వ్యక్తా ? మిసం కలిగిన వ్యక్తా ? అని అడుగే దుస్థితి ఏర్పడింది. ప్రయివేటు విద్యా సంస్థల విద్యార్థులు విదేశీ వ్యామోహంతో, కంప్యూటర్ లోకంలో విహారం చేస్తున్నారు.కొన్ని ఎలక్ట్రానిక్ ఛానల్ వాళ్ళు, వివిధ మీడియా ప్రతినిధులు కొంత మంది విద్యార్థులకు గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తేడా ఏమని అడిగితే చాలా సులభంగా సెలవు దినాలుగా చెప్తున్నారు. మన స్వాతంత్ర్య సమరయోధులు తన మాన, ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటాలు చేసి సాధించిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యత గుర్తించకపోవడం శోచనీయం, ఆందోళన కరమైన విషయం. రాజ్యాంగం ను కొత్తగా రాయడం అనే వాదనను తెరపైకి తేవడం సమంజసమేనా? స్వాతంత్ర్యం సాధించిన తరువాత మన దేశానికి ఏం విధమైన రాజ్యాంగం లేదు.ప్రపంచ వ్యాప్తంగా అమెరికా పెట్టుబడి దారి విధానాన్ని రష్యా సోషలిస్టు విధానాన్ని అనుసరిస్తున్నాయి.మన దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఏ కూటమిలో చేరకుండా తటస్థంగా ఉన్నారు.అది ఇప్పటికి అమలవుతుంది.భారత దేశానికి రాజ్యాంగము ఉండాలని ఎంతో కష్టపడి రూపొందించిన రాజ్యాంగం లో మార్పులు చేర్పులు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ పూర్తిగా కొత్త రాజ్యాంగం రాయాలని చెప్పడం సమంజసం కాదు.రాజ్యాంగం ద్వారా సర్పంచ్, జిల్లా పరిషత్,మండల పరిషత్ చైర్మన్లు, శాసనసభ సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు ( లోక్ సభ, రాజ్యసభ) సభ్యులుగా వివిధ హోదాలను అనుభవించి ఇప్పుడు రాజ్యాంగం కొత్తగా రాయాలని చెప్పడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని అనేక మంది ప్రజలు విమర్శిస్తున్నారు.ఎంతోమంది కష్టపడి రూపొందించిన రాజ్యాంగాన్ని సులభంగా కొత్త రాజ్యాంగం రాయాలని చెప్పడం చాలా శ్రమతోనూ, ఆర్థికంగా గానూ కూడుకున్న వ్యవహారం.కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజ్యాంగం మార్చాలనే వాదనను తెరపైకి తేవడం ఆచరణాత్మకంగా సాధ్యం కాని పని.రాజ్యాంగంలో ఇప్పటికి అనేక సార్లు సవరణలు చేసి అనేక అంశాలను చేర్చడం ఆనందించదగిన విషయం.ఒక సవరణ ద్వారా లౌకిక అని చేర్చడం జరిగింది.మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనగా ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క, ప్రజలే పరిపాలించే ప్రభుత్వమే ప్రజాస్వామ్యమని నిర్వహించడం జరిగింది.మన దేశం సర్వసత్తాక, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పిలుస్తారు.మనకు అనుకూలంగా ఉన్నప్పుడు రాజ్యాంగం బాగుందని చెప్పడం, తనకు వ్యతిరేకంగా ఏమైనా జరిగితే కొత్తగా రాయాలని చెప్పడం సమంజసం కాదు. ప్రపంచ దేశాలకు మన దేశ రాజ్యాంగం ఆదర్శప్రాయం.భారత దేశంలో నివసిస్తున్న ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంకు నిబద్ధుడై భారత రాజ్యాంగం నియమ, నిబంధనలు అనుకూలంగా ఉండాలి.ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను, గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహిస్తూ మువ్వన్నెల జెండా ఎగురవేయడం కాకుండా రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# ఎన్నడూ చూడనంతగా దాడి

**● పూర్తి అసత్యాన్ని 'పరిశోధనా నివేదిక'గా చెప్పేసారు ● అబద్ధాల శక్తిపై విలువైన పాఠం తెలిపిన ఈ దాడి ● పెట్టుబడిదారుల సంక్షేమం- నైతిక వ్యాపార విధానాలే మా నిబద్ధత ● 150 రోజులలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక బృందం 300 సమావేశాల నిర్వహణ**

గౌతమ్ అదానీ
( అదానీ గ్రూప్ చైర్మన్.)

సరిగ్గా ఏడాది క్రితం, 25 జనవరి 2023న, న్యూయార్క్లోని ఒక షార్ట్ సెల్లర్ అదానీ గ్రూప్పై ఆరోపణల సంకలనాన్ని ఆన్లైన్లో ఉంచినట్లు ఉదయం పూట వార్తలు వచ్చాయి. పూర్తి అసత్యాన్ని 'పరిశోధనా నివేదిక'గా తమదైన శైలిలో దీనిని చెప్పుకున్నారు. మీడియాలోని తమ మిత్రుల ద్వారా వారిని మా విరోధులు ఏ విధంగా అయితే పదే పదే పనికిరాని ఆరోపణలు చేస్తుంటారో, అవే తరహా చచ్చు ఆరోపణలు ఆ వార్త నిండా వున్నాయి. మొత్తం మీద చూస్తే , ఇది బహిర్గతమైన మరియు బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం నుండి సేకరించిన అర్ధ–సత్యాలను ఎంపిక చేసి చాకచక్యంగా, నమ్మించే రీతిలో ఒక కథనం వండి వడ్డించారు. మాపై అసత్యాలు, నిరాధార ఆరోపణలు కొత్తేమీ కాదు. కాబట్టి, సమగ్రంగా మా ప్రతిస్పందనను తెలియచేసిన తర్వాత, నేను దాని గురించి ఇక ఆలోచించలేదు. అయితే , సత్యం చెప్పులలో కాళ్ళు పెట్టెలోపలే ఒక అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది ! సత్యమే జీవితంగా, ఆ సత్య వు పునాదుల పై కార్యకలాపాలు నిర్వహించే నాకు , ఈ దాడి తో అబద్ధాల శక్తిపై విలువైన పాఠం తెలుసుకోగలిగాను. షార్ట్ సెల్లింగ్ దాడుల ప్రభావం సాధారణంగా ఫైనాన్షియల్ మార్కెట్లకే పరిమితం అవుతుంది. కానీ , ఇది ఒక ప్రత్యేకమైన అంశం. అందుకే మాపై రెండు–రకాలుగా దాడి జరిగింది – ఒకటి ఆర్థికమైనది, వాస్తవానికి, మరియు రాజకీయ రంగంలో కూడా ఆడేది – ప్రతి ఒక్కటి మరొకదాని పై ఆధారపడి ఉంటుంది. మీడియాలో కొందరి సహాయంతో, మాకు వ్యతిరేకంగా అబద్ధాలు ప్రచారం చేయటం ద్వారా మా పోర్ట్ఫోలియో యొక్క మార్కెట్ క్యాప్ను గణనీయంగా క్షీణింపజేసాయి. సాధారణంగా, కాపిటల్ మార్కెట్లు లో హేతుబద్ధత కంటే భావోద్వేగాలు ఎక్కువ ప్రభావితం చేస్తుంటాయి. నాకు మరింత బాధ కలిగించిన విషయం ఏమిటంటే, వేలాది మంది చిన్న పెట్టుబడిదారులు తమ పొదుపు డబ్బులను కోల్పోయారు. మా విరోధుల ప్రణాళిక పూర్తిగా విజయవంతమై ఉండి ఉంటే, ఆ ప్రభావం చేత ఓడరేవులు మరియు విమానాశ్రయాల నుండి విద్యుత్ సరఫరా చైన్ వరకు అనేక కీలకమైన మౌలిక సదుపాయాల ఆస్తులు నిర్వీర్యమయ్యేవి – ఇది ఏ దేశానికైనా విపత్కర పరిస్థితి. అయినప్పటికీ, మా దృఢమైన ఆస్తులు, మా కార్యకలాపాల యొక్క పటిష్టత మరియు మేము బహిర్గత పరిచే అంశాల యొక్క అధిక నాణ్యత తో పాటుగా , రుణదాతలు మరియు రేటింగ్ ఏజెన్సీలతో సహా మరింత సమాచారం కలిగిన ఉన్న ఆర్థిక సంఘం, ఈ విషపూరిత సమాచారం తో చక్కర్లు కొడుతున్న అబద్ధాలకు అసలు చలించలేదు. మాకు పూర్తి మద్దతుగా, స్థిరంగా నిలబడింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి మా దగ్గర ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేదు. అంతిమంగా, మా వ్యాపారాల పటిష్టతపై మాకు ఉన్న విశ్వాసం మా వ్యూహాన్ని నిర్దేశించింది. మా పెట్టుబడిదారులను రక్షించడం మా మొదటి నిర్ణయం. రూ. 20,000 కోట్ల ఎఫ్పిఓ పూర్తి చేసిన తర్వాత, మేము



ఎఫ్పిఓ ఆదాయాన్ని తిరిగి ఇవ్వాలని నిర్ణయించు కున్నాము. కార్పొరేట్ చరిత్రలో అపూర్వమైన ఈ చర్య, పెట్టుబడిదారుల సంక్షేమం మరియు నైతిక వ్యాపార విధానాల పట్ల మా నిబద్ధతను నొక్కి చెప్పింది. ఈ యుద్ధం మేఘాలు దట్టం గా అలుముకున్న వేళ, మా అతిపెద్ద ఆయుధం తగినంత లిక్విడిటీ మా వద్ద ఉండటం. రూ. 30,000 కోట్ల మా నగదు నిల్వలను పెంపొందించుకోవడానికి, మా గ్రూప్ కంపెనీలలో నిష్కళంకమైన ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులైన పార్టనర్స్ మరియు వంటి వాటికి వాటా విక్రయాల ద్వారా,

తరువాయి రేపటిలో...

## ముంబైలో 22వ ఫ్లాగ్‌షిప్ ఎగ్జిబిషన్ ఐఏఏపిఐ అమ్యూజ్‌మెంట్ ఎక్స్‌పో 2024

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ తన ఫ్లాగ్షిప్ ఎగ్జిబిషన్, 22వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్మెంట్ పార్క్సఅమ్యూజ్మెంట్ ఎక్స్పోను 2024 ఫిబ్రవరి 27 నుండి 29 వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు సగర్వంగా ప్రకటించింది. ఎగ్జిబిషన్కు భారత ప్రభుత్వంలోని పర్యాటక మంత్రిత్వ శాఖ మరియు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మద్దతు ఇస్తుంది. ఈ ప్రదర్శన భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న వినోదం, విశ్రాంతి మరియు వినోద పరిశ్రమకు నిదర్శనం. మునుపటి సంవత్సరాల నుండిఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్మెంట్ పార్క్స్ ఎక్స్పో యొక్క అపారమైన విజయాన్ని పెంపొందిస్తూ, ఈ సంవత్సరం ఈవెంట్ పరిశ్రమ ప్రముఖులు, ఆవిష్కర్తలు మరియు వాటాదారులను ఒకే తాటిపైకి తీసుకువస్తుంది. ఎక్స్పో అత్యాధునిక ఉత్పత్తులు, సేవలు మరియు సాంకేతికతలను ప్రదర్శించడానికి ఒక క్లిష్టమైన వేదికగా పనిచేస్తుంది, ఇది సృజనాత్మకత మరియు వ్యాపార అవకాశాల కేంద్రంగా గుర్తించబడుతుంది.



## గెలాక్సీ ఎస్24 సిరీస్ అందించేందుకు బ్లింకిట్ - శాంసంగ్ ఒప్పందం




గురుగ్రామ్ దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ కంపెనీ శాంసంగ్ ఇటీవల ప్రారంభించిన గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌ను అందించడానికి త్వరిత-కామర్స్ ప్లాట్‌ఫారమ్ బ్లింకిట్‌తో టై-అప్‌ని ప్రకటించింది. ఢిల్లీ-ఎన్‌సిఆర్ బెంగళూరు, ముంబైలోని కస్టమర్‌లుగెలాక్సీ ఎస్ 24 అల్ట్రా,గెలాక్సీ ఎస్ 24 + , గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్‌లను బ్లింకిట్‌లో ఆర్డర్ చేయవచ్చు మరియు 10 నిమిషాలలోపు ఫోన్ డెలివరీ పొందవచ్చు. దేశంలోని 250,000 మంది కస్టమర్‌లు జనవరి 18 నుండి కేవలం మూడు రోజుల్లో గెలాక్సీ 24 స్మార్ట్‌ఫోన్‌ను ముందస్తుగా బుక్ చేసుకున్నారు.

## బెస్ట్ అగ్రోలైఫ్ మెగా ఫార్మర్ మీట్



వ్యవసాయ రసాయన పరిశ్రమలో అగ్రగామి సంస్థ బెస్ట్ ఆగ్రోలైఫ్, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా లోని తొర్రేడు గ్రామంలో (రాజమండ్రి ప్రాంతం ) విజయవంతమైన మెగా ఫార్మర్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 200 మంది ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. ఈ మెగా ఫార్మర్ మీట్ బెస్ట్ ఆగ్రోలైఫ్ యొక్క విస్తృతమైన ఆగ్రో-కెమికల్స్ పోర్ట్‌ఫోలియో గురించి రైతులకు అవగాహన కల్పించింది, వరి సాగు కోసం రూపొందించిన ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించింది. విస్తారా, సిటీజెన్, యాక్సెమాన్ మరియు ట్రైకలర్ లతో సహా కీలక ఉత్పత్తుల ప్రత్యేకతలను తెలిపింది, హాజరైన రైతుల నుండి సానుకూల స్పందనను అందుకుంది. ఈ మెగా ఫార్మర్ మీట్ విజ్ఞాన మార్పిడికి వేదికగా పనిచేసింది, బెస్ట్ ఆగ్రోలైఫ్ మరియు వ్యవసాయ సమాజం మధ్య బలమైన సంబంధాన్ని పెంపొందించింది. సుసంపన్నమైన భవిష్యత్తు కోసం స్థిరమైన వ్యవసాయ పద్ధతులను నిర్ధారిస్తూ వినూత్న పరిష్కారాలతో రైతులకు మద్దతు ఇవ్వడానికి కంపెనీ కట్టుబడి ఉంది అని బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ నేషనల్ మార్కెటింగ్ మేనేజర్ సారా నర్సయ్య చెప్పారు.

## మిసెస్ గోల్డెన్ హార్ట్ ఆఫ్ సౌత్ ఇండియా 2024గా వెంగళ నిఖిల



మిసెస్ ఇండియా వివాసియస్, మిసెస్ తెలంగాణ మరియు మిసెస్ హైదరాబాద్ 2023 టైటిల్ హోల్డర్ అయిన వెంగళ నిఖిల, మిసెస్ గోల్డెన్ హార్ట్ ఆఫ్ సౌత్ ఇండియా 2024 బిరుదును పొందడం ద్వారా తన జాబితాలో మరో ప్రతిష్టాత్మక ప్రశంసలను చేర్చుకుంది. గౌరవనీయులైన రుబారు మిస్టర్ ఇండియా, గోపీనాథ్ రవి దాత్యా ఎత్వానికి ఆమె అసాధారణమైన అంకితభావానికి గుర్తింపుగా అతను నిఖిలాకు ఈ బిరుదును ఇచ్చారు. విండో ఎంటర్టైన్మెంట్స్ మరియు ఏసిటిసి వారు నిర్వహించిన గోల్డెన్ హార్ట్ ఆఫ్ సౌత్ ఇండియా2024 గ్రాండ్ ఫినాలే చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు - మోడల్ మరియు నటి అమీ జాక్సన్, నటి శ్రేయ సరన్, ఇతర ప్రముఖులు విచ్చేశారు.

## ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ నూతన బిజినెస్ ప్రీమియం రూ. 26,000 కోట్ల నమోదు

దేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థలలో ఒకటైన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, 2023 డిసెంబర్ 31తో ముగిసిన కాలానికి రూ. 26,000 కోట్ల నూతన బిజినెస్ ప్రీమియంను నమోదు చేసింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలానికి అంటే డిసెంబర్ 31, 2022తో ముగిసిన కాలానికి సంబంధించి ఇది రూ. 21,512 కోట్లుగా వుంది. సింగిల్ ప్రీమియం డిసెంబర్ 31, 2022తో ముగిసిన సంబంధిత కాలానికంటే 25% పెరిగింది. రక్షణపై స్పష్టమైన లక్ష్యం ఏర్పరుచుకుంటూ, ఎస్‌బిఐ లైఫ్ యొక్క ప్రొటెక్షన్ నూతన బిజినెస్ ప్రీమియం డిసెంబర్ 31, 2023తో ముగిసిన కాలానికి రూ. 2,972 కోట్లుగా ఉంది, ఇది 17% వృద్ధిని సూచిస్తుంది. రక్షణ వ్యక్తిగత నూతన వ్యాపార ప్రీమియం డిసెంబర్ 31, 2023తో ముగిసిన కాలానికి రూ. 667 కోట్లు గా వుంది. . వ్యక్తిగత నూతన వ్యాపార ప్రీమియం 31 డిసెంబర్ 2022తో ముగిసిన సంబంధిత కాలంలో 17% వృద్ధితో రూ. 17,762 కోట్లు గా వుంది. డిసెంబర్ 31, 2023తో ముగిసిన కాలానికి ఎస్‌బిఐ లైఫ్ యొక్క పన్నుల తర్వాత లాభం రూ. 1083 కోట్లు.

## ఫాక్స్‌కాన్ సీఈఓకు పద్మభూషణ్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను గురువారం ప్రకటించింది. అందులో వాణిజ్య-పరిశ్రమల రంగంలో నలుగురిని పద్మ పురస్కారాలు వరించాయి. సీతారామ్ జిందాల్ (కర్ణాటక), యాంగ్ లీ (తైవాన్)లకు పద్మభూషణ్, కల్పనా మోర్పారియా (మహారాష్ట్ర), శశి సోనీ (కర్ణాటక)లకు పద్మశ్రీ దక్కాయి. వీరిలో తైవాన్కు చెందిన వ్యక్తికి భారత అత్యున్నత పురస్కారం ప్రకటించటంతో అందరి దృష్టి ఆయనపై పడింది. తైవాన్కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్కాన్ సీఈఓ నే ఈ యాంగ్ లీ . ఐఫోన్ తయారీలో యాపిల్ సంస్థకు (70శాతం) అతిపెద్ద సరఫరాదారుగా ఉంది ఈ సంస్థ. యాపిల్ ఐఫోన్ల అసెంబ్లింగ్ చేస్తున్న ప్రధాన కంపెనీల్లో ఇది కూడా ఒకటి. కొవిడ్ విజృంభించడంతో ఎదురైన సమస్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల చైనా దేశం వెలుపల తయారీ కార్యకలాపాలను విస్తరించింది. అందులో భారత్కు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని ఉత్పాదక సదుపాయాలపై భారీగా పెట్టుబడి పెట్టింది. పగలు సీఈఓ.. రాత్రి పూట క్యాబ్ డ్రైవర్! ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీ విభాగంలో యాంగ్ లీకు నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఈయన మూడు కంపెనీలు స్థాపించారు. 1988లో యాంగ్ మైక్రో సిస్టమ్స్ అనే మదర్బోర్డ్ కంపెనీ, 1995లో పిసిచిప్సెట్ కోసం ఐసి డిజైన్ కంపెనీ, 1997లో ఐటెక్స్ ను ప్రారంభించారు.

## కో-వర్కింగ్ విభాగంలో కొకర్మ నూతన బెంచ్‌మార్క్




ఉద్యోగుల మధ్య సహకారాన్ని పెంపొందించడం, ఉత్పాదకతను మెరుగుపరచడం మరియు సమాజ భావాన్ని పెంపొందించడంలో ఆఫీస్ ప్రాంగణాలు కీలక పాత్ర పోషిస్తాయి. వినూత్న ఆలోచనలు పంచుకోవడానికి, ముఖాముఖి చర్చలు , మరియు జట్టుగా కృషి చేయటానికి సైతం అనువైన వాతావరణాన్ని ఇవి అందిస్తాయి. కో-వర్కింగ్, ప్రారంభంలో పాశ్చాత్యీకరించబడిన ఒక భావన, అపారమైన ప్రజాదరణ పొందింది. ఇప్పుడు భారతీయ ఉద్యోగ పరిశ్రమను వేగంగా ఆక్రమిస్తోంది. ఈ పరివర్తనకు కొవిడ్-19 వ్యాప్తి, అభివృద్ధి చెందుతున్న వ్యాపార నమూనాలు మరియు ప్రపంచ పోకడల ప్రభావం వంటి అనేక అంశాలు కారణమని చెప్పవచ్చు. ప్రముఖ కమ్యూనిటీ డ్రివెన్ కో-వర్కింగ్ స్పేస్, కొకర్మ. దాని వినూత్న విధానం మరియు వ్యూహాత్మక విస్తరణ కార్యక్రమాలతో హైదరాబాద్‌లోని వర్క్‌స్పేస్‌ల ల్యాండ్‌స్కేప్‌లో విప్లవాత్మక మార్పులు చేస్తోంది. వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి సంపూర్ణ వాతావరణాన్ని అందిస్తూ, దాని శక్తివంతమైన కో-వర్కింగ్ కమ్యూనిటీ లో వ్యవస్థాపకత మరియు వృద్ధిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## 30 లక్షల - 40 లక్షల మధ్య ఉన్న...
# టాప్ ఐదు ప్రీమియం ఎస్‌యువిలు

పెరుగుతున్న కుటుంబాలు విశాలమైన మరియు వర్సటైల్ వాహనాన్ని ఎంచుకోవడంతో, ఎస్యువిలతో భారతదేశం యొక్క ప్రేమ వ్యవహారం వృద్ధి చెందుతూనే ఉంది, బహుశా ఇది ఒక ఎంపికగా మారింది. ఎస్యువి అన్ని రకాల కుటుంబ రోడ్ ట్రిప్‌ల కోసం అలాగే రోజువారీ ప్రయాణాల కోసం శైలి, సౌలభ్యం మరియు పనితీరు యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని అందిస్తోంది. భారతీయ ఆటోమోటివ్ మార్కెట్లో అలలు సృష్టిస్తున్న టాప్ ఐదు ప్రీమియం ఎస్యువి లు, ఎంజి గ్లోస్టర్, టొయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్ , వోక్స్‌వ్యాగన్ టిగువాన్, జీప్ మెరిడియన్: జీ 50 లక్షల వరకు వీటి ధరలున్నాయి. ఈ ప్రముఖ మోడల్‌లు - ఎంజి గ్లోస్టర్, టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్ , వోక్స్‌వ్యాగన్ టిగువాన్ మరియు జీప్ మెరిడియన్ - విస్తృత శ్రేణి ప్రాధాన్యతలను అందిస్తాయి. సందడిగా ఉండే రోడ్లపై సౌలభ్యం, స్టైల్ మరియు స్టెల్లార్ పెర్ఫార్మెన్స్ యొక్క సామరస్య సమ్మేళనం కోసం వారు ప్రతి భారతీయ కుటుంబానికి ఆదర్శవంతమైన ఎస్యువి ఎంపికకు హామీ ఇస్తారు.

MORRIS GARAGES
Since 1924

## విద్యా రుణాలను ప్రారంభించిన టాటా క్యాపిటల్

హైదరాబాద్ : టాటా గ్రూప్‌కు చెందిన ప్రతిష్టాత్మక ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ టాటా క్యాపిటల్ లిమిటెడ్, ఇండియా , యుఎస్ఎ, కెనడా, యుకె, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, సింగపూర్ మరియు దుబాయ్ లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం విద్యా రుణాలను అందించనున్నట్లు వెల్లడించింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, మేనేజ్‌మెంట్ మరియు వృత్తి విద్యా కోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అభ్యసించాలనుకునే వారి కోసం ఈ రుణాలను అందిస్తారు. టాటా క్యాపిటల్ యొక్క ఎడ్యుకేషన్ లోన్‌లు విద్యార్థులకు రూ. 75 లక్షల వరకు కొలేటరల్-ఫ్రీ లోన్‌లు మరియు 200 లక్షల వరకు సెక్యూర్డ్ రుణాలు లేదా ట్యూషన్ ఫీజులు మరియు జీవన వ్యయాలతో సహా మొత్తం విద్య ఖర్చులను అందిస్తాయి. సరసమైన వడ్డీ రేట్లతో పాటు, టాటా క్యాపిటల్ యొక్క ఎడ్యుకేషన్ లోన్‌లు విద్యార్థులకు వారి అభ్యాస కాలంలో సులభంగా చెల్లింపును అందించే సౌకర్యవంతమైన రీపేమెంట్ అవకాశాలను అందిస్తాయి.
ఎడ్యుకేషన్ లోన్‌ల ప్రారంభం గురించి టాటా క్యాపిటల్‌లో రిటైల్ ఫైనాన్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వివేక్ చోప్రా మాట్లాడుతూ, విశ్వాసం మరియు పారదర్శకత ఎల్లప్పుడూ మా వ్యాపారానికి బలమైన మూలస్తంభాలు. విద్యా రుణాల యొక్క సమగ్ర శ్రేణి సాంప్రదాయిక ఆర్థిక సహాయానికి మించి, ట్యూషన్ ఫీజు నుండి ప్రయాణం మరియు వైద్యం వరకు అన్ని అంశాలను కవర్ చేస్తుంది. స్టూడెంట్ ఫస్ట్ విధానంతో, ఉన్నత విద్యకు సామాజిక-ఆర్థిక అవరోధాలను ఛేదించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము, ప్రతి విద్యార్థి తమ విద్యాపరమైన ఆకాంక్షలను నెరవేర్చుకునే అవకాశాన్ని పొందేలా చూస్తాము... అని అన్నారు.

## టాటా మోటార్స్ టియాగో, టిగోర్ ఐసీఎన్‌జీ కార్ల బుకింగ్‌లు ఆరంభం



ముంబై, : దేశపు ప్రముఖ ఆటోమోటివ్ తయారీదారు అయిన టాటా మోటార్స్, తన సీఎన్జీ కార్లలో ఏఎంటీని ప్రవేశపెట్టడం ద్వారా దేశంలో సీఎన్జీ విభాగంలో విప్లవాత్మక మార్పులు చేసిం ది- ఇది పరిశ్రమలో మొదటిది. టియాగో, టిగోర్ ఐసీఎన్జీ ఏఎంటీలకు కంపెనీ ఈరోజు బుకింగ్‌లను ప్రారంభిం చింది. సీఎన్జీ కార్లలో చాలా అవసరమైన బూట్ స్పేస్‌ను ఖాళీ చేయడానికి ట్విన్ సిలిండర్ సీఎన్జీ టెక్నాల జీని పొందుపరచడం ద్వారా, సీఎన్జీ వాహనాల్లో ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్‌ను ప్రవేశపెట్టడం ద్వారా టాటా మోటార్స్ కొత్త ట్రెండ్‌ను ప్రారంభించింది. ఈ కార్లు సీఎన్జీ అత్యున్నత స్థాయి ఆదాలు, ఆటోమేటిక్ సౌలభ్యం, నిరూపితమైన ఆర్కిటెక్చర్, అత్యంత సౌకర్యం, సౌలభ్యం ఫీచర్లపై నిర్మించబడిన భద్రత హామీని అందిస్తాయి కాబట్టి ఇది వినియోగదారులకు గొప్ప ఆఫర్. కస్టమర్‌లు ఇప్పుడు తమ సమీప టాటా మోటార్స్ అధీకృత డీలర్ షి ప్‌ను సందర్శించడం ద్వారా లేదా రూ. 21,000కి ఆన్‌లైన్‌లో ఈరోజు నుండి తమకు నచ్చిన కారును బుక్ చేసుకోవచ్చు.

## వికసిత్ భారత్ స్ఫూర్తితో మహీంద్రా ఆటోమోటివ్ డ్రైవర్స్ ఆఫ్ చేంజ్



ముంబై దేశపు ప్రముఖ ఎస్య ఉవి తయారీదారు మహీంద్రా మహీంద్రా లిమిటెడ్, ఇండియా టుడే గ్రూప్‌తో కలిసి, మహీంద్రా రైజ్ డ్రైవర్స్ ఆఫ్ చేంజ్ కార్యక్రమాన్ని సగర్వంగా ఫ్లాగ్ చేసింది. గణతంత్ర దినోత్సవం 2024 కోసం 'విక్షిత్ భారత్' థీమ్‌కు అనుగుణంగా. ఈ కార్యక్రమం 'నారీ శక్తి' యొక్క స్వరూపులుగా వారి పాత్రను జరుపుకుంటూ, అభివృద్ధి చెందిన మరియు సమగ్ర సమాజం వైపు భారతదేశం యొక్క పురోగతిలో చోదక శక్తిగా మహిళలపై దృష్టి సారించడం లక్ష్యంగా పెట్టుకుంది. న ప్రపంచం కోసం ఎదగండి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండండి మరియు విలువను సృష్టించడానికి ఎదగండి, సానుకూల మార్పును నడిపించే నిబద్ధతతో. ఈ మహిళలు అడ్డంకులను సవాలు చేయడమే కాకుండా ఈ ప్రక్రియలో ఇతరులను శక్తివంతం చేయడం ద్వారా సమాజంలో మార్పును కూడా తెచ్చారు. ఈ మహిళలు రక్షణ, క్రీడలు, సంగీతం, పోలీస్ ఫోర్స్, సామాజిక మరియు పర్యావరణ కార్యకర్తలు వంటి విభిన్న రంగాలకు చెందినవారు ఉన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఆటోమోటివ్ విభాగం ప్రెసిడెంట్ శ్రీ వీజయ్ నక్రా మాట్లాడుతూ, 'రైజ్ ఫర్ ఏ మోర్ ఈక్వల్ వరల్డ్' అనే మా నైతికతతో మేము మా కొత్త ప్రయత్నమైన 'డ్రైవర్స్ ఆఫ్ చేంజ్'ని ఫ్లాగ్ చేయడంలో గర్వపడుతున్నాము. ఈ చొరవ ఉపయోగపడుతుంది. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విక్షిత్ భారత్ ఇతివృత్తానికి మా నిరాడంబరమైన నివాళి, మహిళా సాధికారత - నారీ శక్తిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ డ్రైవ్ ఆదర్శప్రాయమైన రోల్ మోడల్‌లుగా మాత్రమే కాకుండా, లొంగని మహిళలను గుర్తించడం మరియు జరుపుకోవడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

## భారత్‌లో ఫ్రాన్స్ ప్రధాని.. సమక్షంలో టాటా - ఎయిర్ బస్‌ల మధ్య ఒప్పందం



దేశంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సైతం హాజరయ్యారు. ఈ తరుణంలో భారత్ - ఫ్రాన్స్ దేశాల మధ్య వ్యాపార ఒప్పందాలు ఊపందుకున్నాయి. దేశీయ డైవర్సిఫైడ్ దిగ్గజం టాటా - ఫ్రాన్స్ విమానాల తయారీ సంస్థ ఎయిర్బస్ల మధ్య ఒప్పందం జరిగింది. ఈ రెండు సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హెచ్ 125 హెలికాప్టర్లను తయారు చేసేందుకు సిద్ధమయ్యాయి. అందుకు సంబంధించిన ఒప్పందాలు సైతం చివరి దశకు వచ్చినట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే ఈ రెండు సంస్థల మధ్య పలు ఒప్పందాలు జరిగిన విషయం తెలిసిందే. ఇటీవల, టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ఏ320, ఏ350 వంటి కమర్షియల్ జెట్ల కోసం ఎయిర్బస్కు విడిభాగాలను తయారు చేయడానికి, సరఫరా చేస్తున్నట్లు ప్రకటించింది. అదనంగా భారత వైమానిక దళం కోసం టాటా, ఎయిర్బస్లు సీ295 సైనిక రవాణా విమానాన్ని తయారు చేయనున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఆహాలో భయపెట్టనున్న పిండం




థియేటర్లో ప్రేక్షకులను భయపెట్టిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ పిండం ఇప్పుడు 100% లోకల్ తెలుగు ఓటీటీ మాధ్యమం ఆహా లో ఫిబ్రవరి 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. అవసరాల శ్రీనివాస్, శ్రీరామ్, ఈశ్వరీ రావు, ఖుషి రవి తదితరులు ఈ చిత్రంలో ప్రధాన తారాగణంగా నటించారు. వెన్నులో వణుకు పుట్టించే కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం థియేటర్లో ప్రేక్షకులను అలరించింది. భయానక సన్నివేశాలు..వెంటాడే స్టోరీ లైన్తో తెరకెక్కిన ఈ సినిమా ఆడియెన్స్ను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.
సినిమాలోని భయానక సన్నివేశాలు, కల్పానిక అంశాలు, నటీనటుల ప్రతిభతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనటంలో సందేహం లేదు. ఈ చిత్రం ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది.

## వి మెగా ఆఫర్‌లు ఉద్యోగ అవకాశాలు




భారతదేశ 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి, తన ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం అనేక ప్రత్యేకమైన ఆఫర్‌లను ప్రకటించింది. వి ప్రీపెయిడ్ కస్టమర్లు వి యాప్ ద్వారా రీఛార్జ్ చేస్తున్నప్పుడు ఎంపిక చేసిన రీఛార్జ్ ప్యాక్‌లపై ప్రత్యేక డీల్‌లను పొందవచ్చు. విప్రీపెయిడ్ కస్టమర్‌లు అదనపు ఖర్చు లేకుండా 50 జిబి వరకు ప్రత్యేక డేటా ప్రయోజనాలను పొందుతారు మరియు తక్షణ తగ్గింపు ఆఫర్ రూ. 75. 179, 195, 199 మరియు 239 రీఛార్జ్‌లపై ఉన్న వారందరికీ రూ. వరకు ఫ్లాట్ తగ్గింపులు లభిస్తాయి. హీరో అన్‌లిమిటెడ్ 299 ప్యాక్‌కి అప్‌గ్రేడ్ చేయడానికి 50/-. ఈ ఆఫర్‌లో భాగంగా వారు అపరిమిత రాత్ర డేటా, వీకెండ్ డేటా రోల్-ఓవర్ వంటి హీరో ప్రయోజనాలను తగ్గించే ధరలతో ఆనందించవచ్చు! దీనితో పాటుగా, మన దేశంలోని యువత కోసం వి ఇన్ఫో ఎడ్జ్ ద్వారా ప్రముఖ బ్లూ-కాలర్ రికట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ జాబ్ హాయ్ సహకారంతో జనవరి 26 నుండి జనవరి 31, 2024 వరకు జాబ్ మేళాను ప్రవేశపెట్టింది వి యాప్‌లో టెలికాలర్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, బ్యాక్ ఆఫీస్, గ్రాఫిక్ డిజైనర్, డెలివరీ మరియు సెక్యూరిటీ గార్డు వంటి 45 కంటే ఎక్కువ విభాగాలలో 5 లక్షల ఉద్యోగాలను అందిస్తుంది. 10వ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు వియాప్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

## ముగిసిన ఐఎంటి హైదరాబాద్ యూత్ స్కాలర్ లెర్నింగ్ ప్రోగ్రామ్



హైదరాబాద్ : ఐఎంటి హైదరాబాద్ తన యూత్ స్కాలర్ లెర్నింగ్ ప్రోగ్రాం కోసం పరిసర గ్రామాల నుండి పాఠశాల విద్యార్థుల కోసం మేనేజ్మెంట్ విద్యార్థులచే నిర్వహించబడింది. ఐఎంటి హైదరాబాద్ విద్యార్థులు ప్రతి ఆదివారం 6-14 సంవత్సరాల పిల్లలకు బోధించే నాలుగు నెలల కార్యాచరణ ముగింపు కార్యక్రమం. ఐఎంటి హైదరాబాద్ క్యాంపస్లో నాలుగు నెలల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ఘస్మియాగూడ, శంకరపురం మరియు చెర్లగూడ గ్రామాలకు చెందిన దాదాపు అరవై మంది పిల్లలు ఇప్పట్ల నుండి ప్రయోజనం పొందారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సిఇఒ శ్రీమతి రేఖా శ్రీనివాసన్ మాట్లాడుతూ, సామాజిక కార్యక్రమాలలో విద్యార్థుల అనుభవం భవిష్యత్ వ్యాపారవేత్తలుగా వారి నిర్ణయాలను ఎలా రూపొందిస్తుందో పేర్కొన్నారు. పర్యావరణ మరియు సామాజిక సవాళ్లు పెరుగుతున్న తరుణంలో, యువ తరం ఒక ఆశాకిరణం మరియు ప్రేరణగా పనిచేస్తుంది.

తరువాతి తరంలో విలువలు మరియు బాధ్యత యొక్క భావాన్ని పెంపొందించడానికి సహాయపడే ఇటువంటి కార్యక్రమాలు తదుపరి శ్రేణి నాయకులను రూపొందించడంలో అమూల్యమైనవి.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ పి. రాంచందర్ రావు విద్యార్థి వాలంటీర్ల కృషిని అభినందించారు. రోల్ మోడల్స్ నుండి నేర్చుకునేందుకు మరియు వారి జీవితంలో దిశ మరియు లక్ష్యాన్ని సాధించడానికి పిల్లలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఐఎమ్టి హైదరాబాద్ డీన్ డాక్టర్ వి.చక్రపాణి మాట్లాడుతూ ఇదొక అద్భుతమైన కార్యక్రమమని, అధ్యాపకులు కూడా చొరవలో భాగమై ఆనందించారని అన్నారు.

# బీఆర్ఎస్ ఒకటి రెండు స్థానాలకే పరిమితమవుతుంది

- బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడుతుందన్న ఉత్తమ్
- కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలుస్తుందని ధీమా

తెలంగాణ బ్యూరో్రపతినిధిః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ మంచి జోష్ లో ఉంది. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో బీఆర్ఎస్ ఛైర్మన్లపై అవిశ్వాసాలను పెట్టిస్తూ వాటిని కైవసం చేసుకుంటోంది. రానున్న లోక్ సభ ఎన్నికల్లో సైతం సత్తా చాటి బీఆర్ఎస్ కు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉంది. వెయ్యి అడుగుల గొయ్యి తవ్వి బీఆర్ఎస్ కు బొంద పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే అంటున్న సంగతి తెలిసిందే.
తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీనపడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 14 లోక్ సభ స్థానాలను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఒకట్రెండు స్థానాలకే పరిమితమవుతుందని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలపై విచారణ ప్రారంభించామని... అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఉత్తమ్ హెచ్చరించారు.
జాన్ పహాడ్ దర్గా ఉర్సులో ఈరోజు ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. దర్గా అభివృద్ధికి ఆయన కోటి రూపాయలను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పైవ్యాఖ్యలు చేశారు.



# ఘనంగా గణతంత్ర వేడుకలు

- కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి
- గణతంత్ర పరేడ్‌ను నడిపించిన నారీమణులు
- గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో నారీశక్తి వెల్లివిరిసింది
- దేశ సైనిక శక్తిని చాటిన త్రివిధ దళాల ప్రదర్శనలు





దిల్లీ: భారత రిపబ్లిక్ డే వేడుకలు శుక్రవారం దేశమంతా ఘనంగా జరుగుతున్నాయి. దేశ రాజధాని దిల్లీ లో గణతంత్ర ఉత్సవం అంబరాన్నంటింది. కర్తవ్యపథ్లో దేశ ప్రథమ మహిళ ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు తదితరులు హాజరయ్యారు.
ఈ ఉదయం జాతీయ వార్ మెమోరియల్ను ప్రధాని మోదీ సందర్శించడంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సంప్రదాయ బగ్గీలో వేదిక వద్దకు చేరుకున్నారు. దాదాపు 40ఏళ్ల తర్వాత గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి మళ్లీ ఈ బగ్గీని వినియోగించారు. కర్తవ్యపథ్కు చేరుకున్న తర్వాత రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆ తర్వాత శకటాల ప్రదర్శన ప్రారంభమైంది.
పరేడ్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సారి జాతీయ మహిళా శక్తితోపాటు ప్రజాస్వామిక విలువలు ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు. ఆవాహన్‌తో పరేడ్ను మొదలుపెట్టారు. ఇందులో 100 మంది మహిళలు భారతీయ సంగీతాన్ని వినిపించారు. అందులో సంప్రదాయ బ్యాండ్కు బదులుగా శంఖం, నాదస్వరం, నగారాతో ప్రదర్శన ఇచ్చారు.స
జాతీయ మహిళా శక్తితో పాటు ప్రజాస్వామిక విలువలు ప్రతిబింబించేలా ఈ సారి పరేడ్ను నిర్వహించారు. చరిత్రలో తొలిసారిగా త్రివిధ దళాలకు చెందిన నారీమణులు.. మన సైనిక అమేయ శక్తిని చాటిచెప్పారు. దేశ భద్రతలో మన నారీశక్తి ని వీక్షించి భారతీయులు ఉప్పొంగిపోయారు.

జయహో... నారీ భేరి!

పరేడ్ విశేషాలు..

ఆవాహన్‌తో పరేడ్ను మొదలుపెట్టారు. ఇందులో 100 మంది మహిళలు భారతీయ సంగీతాన్ని వినిపించారు. సంప్రదాయ బ్యాండ్కు బదులుగా శంఖం, నాద స్వరం, నగారాతో ప్రదర్శన ఇచ్చారు.
నాలుగు ఎంఐ-17వి హెలికాప్టర్లు ధ్వజ్ ఆకృతిలో విన్యాసాలు ప్రదర్శించాయి.
ఈసారి పరేడ్లో 90 మంది సభ్యుల ఫ్రాన్స్ దళం కూడా పాల్గొంది. ఫ్రెంచ్ దళం ప్రదర్శన సమయంలో రఫేల్ యుద్ధ విమానాలు గగనతలంలో విన్యాసాలు చేశాయి.
మహిళా అధికారులు దీప్తి రాణా, ప్రియాంకా సేవ్దా.. ఆయుధ లొకేషన్ గుర్తింపు రాడార్, పినాక రాకెట్ వ్యవస్థలకు నేతృత్వం వహించారు.
చరిత్రలో తొలిసారిగా అందరూ మహిళలే సభ్యులుగా ఉన్న త్రివిధ దళాలు పాల్గొన్నాయి. ఇందులో అగ్నివీర్లు కూడా ఉన్నారు.
ఆత్మనిర్భరత, నారీశక్తి థీమ్తో నౌకాదళ శకటం ఆకట్టుకుంది. ఐఎన్ఎస్ విక్రాంత్తో పాటు, శివాలిక్, కలవరి క్లాస్ సబ్మెరైన్లను ప్రదర్శించారు.
దేశీయంగా తయారుచేసిన ఆయుధాలతో పాటు క్షిపణులు, డ్రోన్ జామర్లు, నిఘా వ్యవస్థలు, వాహనాలపై అమర్చే మోటార్లు, బీఎంపీ-2 సాయుధ శకటాలను ప్రదర్శించారు.
ఎయిర్ఫోర్స్ మార్చ్కు స్క్వాడ్రన్ లీడర్లు రశ్మీ ఠాకుర్, సుమితా యాదవ్, ప్రతిథి అహ్లువాలియా, ఫ్లైట్ లెఫ్టినెంట్ కిరిట్ రొహైల్ నేతృత్వం వహించారు.
260 మంది సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్బీ మహిళా సైనికులు నారీ శక్తి పేరుతో విన్యాసాలు చేశారు. తొలిసారి బీఎస్ఎఫ్ మహిళా బ్రాస్ బ్యాండ్ ఈ పరేడ్లో పాల్గొంది.
300 ఏళ్ల బాంబే శాపర్స్ రెజిమెంట్ చరిత్రలో తొలిసారిగా అందరూ పురుషులే ఉన్న బృందానికి ఒక మహిళ నాయకత్వం వహించారు. 31 ఏళ్ల మేజర్ దివ్య త్యాగికి ఈ అవకాశం దక్కింది.
ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు అందుకున్న 19 మంది పరేడ్లో పాల్గొన్నారు.
రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు పరేడ్లో పాల్గొన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శకటాలున్నాయి. వీటితోపాటు సామాజిక-ఆర్థిక కార్యకలాపాలు, శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన మహిళలు ప్రదర్శించిన 10 శకటాలు ఆకట్టుకున్నాయి.



# భారత్‌తో ఆటలొద్దు..

- పశ్చిమ దేశాలకు పుతిన్ హెచ్చరిక!
- భారత్ విదేశీ విధానంపై ప్రశంసలు
- నేటి ప్రపంచంలో అంత సులభం కాదు
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

మాస్కో: భారత్ అనుసరిస్తోన్న విదేశీ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ప్రశంసలు కురిపించారు. అలా పాటించడం నేటి ప్రపంచంలో అంత సులభం కాదన్నారు. ఆ దేశ రాజకీయాలను ప్రభావితం చేసేందుకు బయటనుంచి ఆటలు ఆడే ప్రయత్నాలకు భవిష్యత్తు ఉండదన్నారు. రష్యన్ స్టూడెంట్ డే సందర్భంగా కాలినింగ్రాడ్ ప్రాంతంలోని యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించిన పుతిన్.. ప్రధాని మోదీని మరోసారి ప్రశంసించారు.

మోదీ సారథ్యంలో..

స్వతంత్ర విదేశీ విధానాన్ని భారత్ అనుసరిస్తోంది. నేటి ప్రపంచంలో అది అంత తేలిక కాదు. సుమారు 150 కోట్ల జనాభా కలిగిన భారత్కు ఆ హక్కు ఉంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశాల్లో భారత్ ఒకటి. అది కూడా ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం వల్లే. ఆయన సారథ్యంలోనే భారత్ ఇంతటి వేగం పుంజుకుంది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా మోదీ నిర్ణయాలు తీసుకుంటారని ఊహించడం అసాధ్యం. ఈక్రమంలో భారత్, ఆ దేశ నాయకత్వంపై రష్యా ఆధారపడవచ్చు అని పుతిన్ పేర్కొన్నారు. భారత్లో రాజకీయ పలుకుబడి కోసం ఆటలాడవద్దని బయటి శక్తులను హెచ్చరించిన ఆయన.. అటువంటి ప్రయత్నాలకు భవిష్యత్తు ఉండదన్నారు.

గొప్ప సంస్కృతి..

భారత్కు గొప్ప సంస్కృతి ఉంది. జాతీయ టీవీ ఛానెళ్లలో భారతీయ సినిమాలను ప్రసారం చేసే అతికొద్ది దేశాల్లో రష్యా ఒకటి. ఇలా మరే దేశం చేస్తుందని అనుకోవడం లేదు. నరేంద్ర మోదీ నాయకత్వంలో మొదలైన మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని రష్యాతో పాటు ఎన్నో దేశాలు చూస్తున్నాయి. ఆ ప్రణాళికలన్నింటినీ ఆచరణలో పెట్టేందుకు భారత భాగస్వాములతో కలిసి ప్రయత్నిస్తున్నాం. భారత్కు వచ్చే విదేశీ పెట్టుబడుల్లో అత్యధికంగా రష్యా నుంచే వస్తున్నాయి అని పుతిన్ వెల్లడించారు. ఓ చమురు శుద్ధి కర్మాగారం కొనుగోలు, గ్యాస్ స్టేషన్లు, పోర్టులు తదితర రంగాల్లో పెట్టుబడులను ఆయన ప్రస్తావించారు.

# ఊసరవెల్లిని మించిన నితీశ్ రాజకీయం

- మళ్లీ బీజేపీతో కలిసి సర్కారు ఏర్పాటుకు సంకేతాలు
- సీఎం పదవిలో నితీష్‌ని నిలిపేందుకు కమలనాథులు సై



లక్నో... సార్వత్రిక ఎన్నికల వేళ దేశంలో రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. ఈసారి కూడా మోదీ నేతృత్వంలో ఎన్డీయే సర్కార్ కే అధికారం దక్కొచ్చన్న అంచనాల మధ్య నిన్న మొన్నటివరకూ కలిసి ఉన్నట్లుగా కలరింగ్ ఇచ్చిన విపక్షాలు ఇప్పుడు కొత్త దారులు వెతుక్కుంటున్నాయి. ముఖ్యంగా గతంలో పలుమార్లు బీజేపీతో కలిసి ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ఇప్పుడు కాంగ్రెస్, ఆర్జేడీతో కలిసి యూపీఏ సర్కార్ నడుపుతున్న నితీశ్ కుమార్.. తాజా పరిణామాలతో మరోసారి యూటర్న్ తీసుకున్నారు. బీహార్లో కుల గణన చేపట్టి బీసీల్ని పూర్తిగా తమవైపుకు తిప్పుకున్నానని భావించిన నితీశ్ కుమార్ కు లోక్ సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఆధిక్యం సాధించే అవకాశం ఉన్నట్లు తేలడంతో రూటు మార్చేశారు. వచ్చే ఏడాది జరగాల్సిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్ని లోక్ సభ ఎన్నికలతో కలిపి నిర్వహించేలా ముందస్తుకు వెళదామని మిత్రపక్షం ఆర్జేడీకి ప్రతిపాదించారు. కానీ ఆర్జేడీ నో చెప్పడంతో ఆ పార్టీని వదిలించుకుని తిరిగి బీజేపీతో జట్టు కట్టేందుకు సిద్ధమయ్యారు. విశ్వంభరుడికి చిరు సన్మానం ఇవాళ గవర్నర్ ను కలిసిన నితీశ్ కుమార్ ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేసి తిరిగి బీజేపీతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించారు. ఈసారి బీజేపీకి గతంలోలాగే రెండు ఉప ముఖ్యమంత్రి పదవుల్ని ఆఫర్ చేసేందుకు నితీశ్ సిద్ధమవుతున్నారు. తాను మాత్రం సీఎం పదవిలోనే కొనసాగుతానని బీజేపీకి తేల్చిచెప్పేశారు. ముందు నితీశ్ సీఎం పదవి వదులుకోవాలని చెప్పిన బీజేపీ.. చర్చల తర్వాత ఆ పదవి వదులుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే వారం కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసే ఏడోసారి సీఎం అయ్యేందుకు నితీశ్ కుమార్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
మరోవైపు నితీశ్ దూరమైనా కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఓ ఎంఐఎం ఎమ్మెల్యే, మరో స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు ఉన్న ఆర్జేడీ అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా, కూటమిని నడిపించే స్థాయిలో ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 122 సీట్లకు రెండు సీట్ల దూరంలో ఉండిపోతోంది. దీంతో మరో ఇద్దరు ఎమ్మెల్యేల సాయం లభిస్తే ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం జీతన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని నలుగురు ఎమ్మెల్యేల హెచ్ఏఎమ్ మద్దతు తీసుకుని ఆ పార్టీకి డిప్యూటీ సీఎం ఆఫర్ చేస్తున్నారు. అయితే వీరి చేరిక తర్వాత కూడా ప్రభుత్వం కొనసాగాలంటే మరో ఇద్దరు తప్పనిసరి.

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విషాదం..



ములుగు, సూర్య ప్రతినిధి జనవరి 26 (మేజర్ న్యూస్) : గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ములుగులో విషాదం నెలకొంది. జాతీయ జెండా ఆవిష్కరించేందుకు శివాలయం ఎదురుగా యువకులు సమాయత్తం అవుతున్న క్రమంలో జెండా పైపును అమర్చుతుండగా 11కేవీ విద్యుత్ తీగలు తగిలి ముగ్గురు యువకులకు షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరు మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం ములుగులోని శివాలయం ఎదురుగా యువకులు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం 9గంటల ప్రాంతంలో బోడ అంజిత్ కుమార్ (28), ల్యాద విజయ్ (25), బోడ కళ్యాణ్ తోపాటు మరికొంతమంది యువకులు కలిసి జెండా కోసం ఇనుక పైవును నిలబెట్టే పనుల్లో ఉన్నారు. అయితే జెండా గద్దెపైనే 11కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. వైర్లను గమనించకుండా పైవును పైకి ఎత్తుతున్న క్రమంలో విద్యుత్ తీగలు ఇనుక పైవుకు తగిలి షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో అంజిత్, విజయ్, కళ్యాణ్ తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అంజిత్, విజయ్ మృతిచెందారు. కళ్యాణ్ చేతులకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మృతులకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని, తీవ్ర గాయాలైన యువకుడు కళ్యాన్కు మెరుగైన చికిత్స అందించాలని మంత్రి వైద్యులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులు మృతిచెందడంతో విషాదం నెలకొంది.

## అణగారిన వర్గాలకు రాజ్యాధికారంలో వాటా దక్కాలి



తెలంగాణ బ్యూరో్రపతినిధిః దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాధికారంలో వాటా దక్కాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకున్న సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 గుడిమల్కాపూర్ సంఘం ఆఫీస్ లో పాల్వాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మోహన్ నాయి. వైస్ ప్రెసిడెంట్ యు రాములు నాయి. క్యాషియర్ శివకుమార్, ఆర్గనైజ్ సెక్రటరీ రమేష్ కోడిచెర్ల. రూపేష్ నాయి, గుర్రప్ప నాయి, రమేష్ నాయి, మురళీధర్ నాయి తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో తెలంగాణ గళం

- పార్టీ ఎంపీలకు కేసీఆర్ నిర్దేశం
- పాల్గొన్న లోక్ సభ మరియు రాజ్యసభ సభ్యులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్ :తెలంగాణ హక్కులకోసం పోరాడే దళం బిఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని, రాబోయే పార్లమెంటు సమావేశాల్లో బిఆర్ఎస్ ఎంపీలు తెలంగాణ హక్కుల సాధన కోసం గళం విప్పాలని బీఆర్ఎస్ అధినేత పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం నాడు ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో రాజ్యసభ, లోకసభ పార్లమెంటరీ నియోజకవర్గం పార్టీ నేతలు కె కేశవరావు, నామా నాగేశ్వర్ రావు సహా పార్టీ ఎంపీ లు రాములు, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, మన్నె శ్రీనివాస్ రెడ్డి, కెఆర్ సురేష్ రెడ్డి, వెంకటేష్ నేతకాని, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, మలోత్ కవిత, పార్థసారథి రెడ్డి, జోగినపల్లి సంతోష్ కుమార్, దేవకొండ దామోదర్ రావు, గడ్డం రంజిత్ రెడ్డివీరితో పాటు కేటీఆర్ హరీష్ రావు లు పాల్గొన్నారు. ఈ నెల చివరలో ప్రారంభమై వారం రోజులపాటు సాగనున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ తరవున బలమైన వాదనలు వినిపించాలని కేసీఆర్ ఎంపీ లకు స్పష్టం చేసారు. నదీ జలాల కేటాయింపులు, ఉమ్మడి ఆస్తుల పంపకాలతో పాటు పెండింగు లో వున్న రాష్ట్ర విభజన హామీల సాధనకోసం ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదేనన్నారు. కాగా నాడైనా నేడైనా తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే సందర్భాల్లో అడ్డుకుని కాపాడలవలసిన బాధ్యత మరోసారి బిఆర్ఎస్ ఎంపీలదేనని స్పష్టం చేశారు.దాదావు మూడు గంటల పాటు సాగిన సమావేశంలో, పార్లమెంటు ఉభయ సభల్లో, పలు అంశాలపై అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించాల్సిన విధానాలపై అధినేత కేసీఆర్ ఎంపీ లకు దిశానిర్దేశం చేశారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు
# సీఎం రేవంత్ రెడ్డి పరామర్శ



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జనవరి26)ఃకాలి నొప్పితో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి నగరంలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ప్రసాద్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# చిరంజీవికి ఇంటికి మంత్రి కోమటిరెడ్డి

## పద్మవిభూషణ్ అవార్డు రావడం పట్ల మంత్రి హర్షం



తెలంగాణ బ్యూరో్రపతినిధిః పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మెగాస్టార్ చిరంజీవి ఇంటికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో రెండో అత్యున్నత పౌరపురస్కారమైన పద్మవిభూషణ్ అవార్డు చిరంజీవిని వరించింది. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లారు. పురస్కారం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చిరంజీవికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. మెగాస్టార్ మరిన్ని ఉన్నతస్థానాలకు ఎదగాలని, మరిన్ని అవార్డులు, పురస్కారాలు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ నటుడైన చిరంజీవి పద్మ విభూషణ్ అవార్డు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతరత్న కూడా రావాలని కోరుకున్నారు. పునాదిరాళ్ల నుంచి విశ్వంభరదాక... కోట్లాది గుండెల్ని కదిలించి... రక్తదానం నుంచి నేత్రదానం దాక... లక్షల మందికి పునర్జన్మను ప్రసాదించి... మనందరి మనస్సుల్లో చిరంజీవిగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి గారు ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు అని ట్వీట్ చేశారు.

## కాంగ్రెస్ పాలన పట్ల మహిళలకు విశ్వాసం పెరిగింది

తెలంగాణ బ్యూరో్రపతినిధిః యాభై రోజుల కాంగ్రెస్ పాలన లో మహిళలకు విశ్వాసం పెరిగిందని కాంగ్రెస్ నాయకురాలు సినీ నటి దివ్య వాణి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల పది కోట్ల మంది మహిళలు ప్రయోజనం పొందారు. ప్రగతి భవన్ ను ప్రజా భవన్ చేశారు. రాజకీయ విలువలు పెంచేలా కేసిఆర్ అనారోగ్యంతో ఉన్నప్పుడు సీఎం వెళ్లి పరామర్శించారు. ఏపీసీసీ అధ్యక్షులుగా షర్మిల నియామకం అవ్వడం శుభసూచికం.
పార్లమెంట్ ఎన్నికల్లో నూతన ఉత్సాహం తో పనిచేయాల్సిన అవసరం ఉంది. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని దివ్య వాణి స్పష్టం చేశారు.

# డీకే అరుణ విలువలు లేని వ్యక్తి

## సిడబ్ల్యూసి మెంబర్ వంశీ చంద్ రెడ్డి



తెలంగాణ బ్యూరో్రపతినిధిః విలువలు, విధానాలు లేని వ్యక్తి డీకే అరుణ అని సిడబ్లూసి మెంబర్ వంశీచంద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అవకాశవాద రాజకీయాలకు డీకే అరుణ మారుపేరు అసదుద్దీన్ పిలిస్తే డీకే అరుణ ఏంఐఏం లోకి వెళ్తుంది. డీకే అరుణ కంటే దగాకోరు అరుణ అంటే కరెక్ట్ సెట్ అవుతుంది. 2019లో 15 కోట్లు ఇస్తే కాంగ్రెస్ నుండి మహబూబ్ నగర్ ఎంపీ గా పోటీ చేస్తానని డీకే అరుణ చెప్పింది. డీకే అరుణ డబ్బులు అడిగినట్టు ప్రమాణం చేయడానికి నేను రెడీ అన్నారు. ఏ రామ మందిరానికి రమ్మన్నా నేను వస్తాను. 28 వతేది 11 గంటలకు మహబూబ్ నగర్ లోని టీచర్స్ కాలనీలోని రామ మందిరానికి వస్తాను. రాముడి భక్తురాలు నేనా, డీకే అరుణ నా అనేది తెలిపొద్ది. డీకే అరుణ తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే రకం అని అన్నారు. పూటకో పార్టీ మార్చే వ్యక్తి డీకే అరుణ. డీకే అరుణ పేరు పలకాలి అంటే నాకు సిగ్గుగా ఉందన్నారు.

# బస్ భవన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

## జాతీయ జెండాను ఆవిష్కరించిన టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్



తెలంగాణ బ్యూరో్రపతినిధిః హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) కేంద్ర కార్యాలయం బస్ భవన్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం టీఎస్ఆర్టీసీని ఆదరిస్తోన్న ప్రజలకు, సంస్థ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న సిబ్బందికి 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ప్రతి పౌరుడు దేశ పురోభివృద్ధికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శుభదినాన భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహనీయుడిని స్మరించుకోవాలన్నారు. ఈ గణతంత్ర వేడుకల్లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప, సీపీఎం ఉషాదేవి, తార్నాక ఆస్పత్రి ఓఎస్డీ డాక్టర్ సైది రెడ్డి, సీటీఎం జీవన ప్రసాద్, సీసీఓఎస్ విజయభాస్కర్, సీఈఐటీ రాజశేఖర్, సీటీఎం కమర్షియల్ సుదర్శన్, సీసీఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# భారీ విగ్రహాలు పెడితే కడుపు నిండదు : గణతంత్ర వేడుకల్లో వైఎస్ షర్మిల

విజయవాడ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : నగరంలోని ఏపీసీసీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల రెడ్డి వేడుకల్లో పాల్గొని జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ అంబేద్కర్ అన్ని వర్గాల వారి కోసం రాజ్యాంగం రూపొందించారన్నారు. కేంద్రంలో బీజేపీ, ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ భారీ విగ్రహాలు పెడితే పేదల ఆకలి నిండదన్నారు. దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎదిరిస్తే గుండు గీసి అవమానించారని విమర్శించారు. దారుణంగా చంపి డోర్ డెలివరీ చేసినవారిని పక్కన పెట్టుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ గురించి గొప్పగా చెప్పడం కాదని.. ఆయన ఆశయాలను గొప్పగా అమలు చేయాలని హితవుపలికారు.

ఎస్సీ , ఎస్టీ నిధులు దారి మళ్లించి సొంత అవసరాలకు వాడారని ఆరోపించారు. దళితులపై కపట ప్రేమ చూపేవారికి తగిన బుద్ధి చెప్పాలని షర్మిల రెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల్లో రఘువీరా రెడ్డి, తులసి రెడ్డి, జెడి శీలం, సుంకర పద్మశ్రీ, నరహరశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజి పాల్గొన్నారు.

# గత మెజారిటీని మించి విజయం సాధించాలి

- సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలి
- టిడిపి కుట్రలను తిప్పి కొట్టాలి
- మంగళగిరి పార్టీ నాయకులు, కార్యకర్తలతో రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : మంగళగిరిలో గతంలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ వచ్చే విధంగా పని చేయాలని పార్టీ నాయకులు,కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ పార్లమెంటరీ నాయకులు విజయసాయిరెడ్డి పిలువునిచ్చారు. మొదటిగా నియోజకవర్గంలో ఈ నెల 31న పార్టీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, జగనన్న సైనికులతో శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వరుస సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలానికి నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31న సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళగిరిలోని వైయస్సార్ విగ్రహం వద్ద నుంచి ముందుగా పాదయాత్ర ప్రారంభమై లక్ష్మీ నరసింహ స్వామి గోపురం మీదుగా మిద్దే సెంటర్ వరకు సాగుతుందని చెప్పారు.ఈ సమావేశానికి రాష్ట్రంలోని బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీలకు చెందిన నాయకులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో మొదలు పెడుతున్న మొదటి కార్యక్రమం కావున అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. ఇక్కడ నుండి టిడిపి నాయకుడు లోకేశ్ ఇక్కడ పోటీ చేస్తున్నాడు. గతంలో ఓటమి చెందాడు కాబట్టే.కుమారుడు లోకేష్ ను గెలిపించేందుకు చంద్రబాబు నాయుడు సతవిధాలుగా ప్రయత్నాలు చేస్తాడని, ఈ నియోజకవర్గ ఏం చేయడానికి అయినా వెనకడుగు వేయాడని, ప్రజలు మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. చెయ్యగలిగినది, చేయలేని హామీలను కూడా ఇచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే నియోజకవర్గంలో కుట్రలు చేసే అవకాశం లేకపోలేదన్నారు.. వాటన్నిటినీ మనం అధిగమించాల్సి ఉందన్నారు.. తెలుగుదేశం పార్టీకి దీటుగా సమాధానం చెప్పేందుకు మొదటిగా సాధికార బస్సు యాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని చెప్పారు.

**త్వరలో పార్టీ కమిటీలు**

మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్, తాడేపల్లి టౌన్, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల మండలాలకు పార్టీ కమిటీలు త్వరలో నియమించనున్నట్లు ఆయన చెప్పారు..ఇందులో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఉండేలా చూసుకోవాలని నాయకులు, కార్యకర్తలకు చెప్పారు..ఈ కమిటీలు వేసే సమయంలో అందరి అభిప్రాయాలను పార్టీ తీసుకుంటుందని చెప్పారు.

**గంజి చిరంజీవితో కలిసి నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకుంటా**

భవిష్యత్తులో గంజి చిరంజీవితో కలిసి నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకుంటానని విజయసా రెడ్డి హామీ ఇచ్చారు..ఒక పక్కన ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయాని,మరోక విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నా ఎంపి లాండ్స్ నిధులు నుండి నిధులు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నానని చెప్పారు. ఈ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నా వంతు సహాయం చేస్తానన్నారు.. మీ సమస్యలను ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా పరిష్కరించడానికి రీజనల్ కోఆర్డినేటర్ గా నేను సిద్ధంగా ఉంటానని కార్యకర్తలకు విజయసాయిరెడ్డి భరోసా ఇచ్చారు. సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత ఇవ్వడం ద్వారా బిసి,ఎస్సి,ఎస్టీ,మైనారిటీ వర్గాలు ఆర్థిక సాధికారత సాధించేలా సీఎం జగన్ బాటలు వేశారని చెప్పారు.

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా,దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి గారికి దక్కుతుందని చెప్పారు. ఈ విషయాలను ప్రజలకు చెప్పాలనే ఉద్దేశంతో అలాగే భవిష్యత్తులో కూడా మనం ఏం చేయబోతున్నామో చెప్పేందుకే ఈ సామాజిక సాధికార బస్సు యాత్రను 175 నియోజకవర్గాల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మంగళగిరి నియోజకవర్గంలో ఎటువంటి కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.. గడపగడపకు మన ప్రభుత్వం, గుడ్ మార్నింగ్ మంగళగిరి, కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి వెళ్తే అక్కడ సమస్యలు మనకు అర్థమవుతాయని చెప్పారు.. ఈ కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత నియోజకవర్గ సమన్వయకర్త మీద ఉందని ఆయన చెప్పారు..ఈ సమావేశాలలో నియోజకవర్గ పరిశీలకు రాపాక శ్రీనివాస్,నియోజకవర్గ నాయకులు వేణుగోపాలరెడ్డి, వివేక్, డేవిడ్ రాజు, మల్లేశ్వరరావు, దనబోయిన సంతోష్ రుపారాణి, తదితరులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన

# అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం





గుంటూరు, సూర్య ప్రత్యేక ప్రతినిధి : 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన పిదప మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా 75వ గణతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్న శుభ దినాన ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకి ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డా.పిపికె. రామాచార్యులు, ఉప కార్యదర్శులు సుబ్బరాజు, విజయరాజు,చీఫ్ మార్షల్ డి.ఏడుకొండల రెడ్డి,లీగల్ అడ్వయిజర్ ఎం.చంద్రశేఖర్, పలువురు అసెంబ్లీ అధికారులు, ఉద్యోగులు, ఎస్పిఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలది రహస్య బంధం

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో రెండు పార్టీల మధ్య అవగాహన బట్టబయలు
- మాజీ మంత్రి హరీశ్ రావు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః అధికార కాంగ్రెస్ పార్టీ , బీజేపీలపై మాజీ మంత్రి హరీష్‌రావు మరోసారి ఫైర్ అయ్యారు. ఎక్స్ వేదికగా ఇరు పార్టీలపై విరుచుకుపడ్డారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం వ్యవహారంపై స్పందిస్తూ.. కాంగ్రెస్, బీజేపీల రహస్యమైత్రి మరో సారి బయటపడిందన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో రెండు పార్టీల మధ్య ఉన్న అవగాహన బట్టబయలు అయిందన్నారు. బీజేపీ ఎజెండాకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకి మేలు చేసే విధంగా గవర్నర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్నారనే కారణంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా నియమించడానికి ఈ గవర్నర్ నిరాకరించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడినే సిఫారసు చేస్తే గవర్నర్ ఆమోదించారన్నారు. ఇది ద్వంద్వ నీతి కాదా ? కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా గవర్నర్ వ్యవహరించడం కాదా ? గతంలో కూడా క్రీడా, సాంస్కృతిక , విద్యా సామాజిక , సేవ రంగాల్లో కృషి చేసిన వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసింది. అప్పుడు కూడా గవర్నర్ రాజకీయ కారణాలతో వాటిని ఆమోదించలేదు. మరి ఇప్పుడు ఎందుకు ఆమోదించారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ , బీజేపీ రెండు పార్టీలు ఒక్కటై బీఆర్ఎస్ పార్టీని అణగదొక్కాలని చూస్తున్నాయన్నారు. ఈ కుట్రలో గవర్నర్ స్వయంగా భాగస్వామి కావడం అత్యంత దురదృష్టకరమన్నారు. న్యాయ సూత్రాలు, రాజ్యాంగ సాంప్రదాయాలు అన్ని పార్టీలకు ఒకే రకంగా ఉండాలని.. కానీ బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా చూపిస్తున్నారని హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

హైకోర్టులో జాతీయ జెండాను ఆవిష్కరించిన

# చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి :75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం నేలపాడులోని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిగా పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26 మన దేశం సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా ప్రకటించబడి 75 వసంతాలు పూర్తి చేసుకున్న గొప్ప శుభదినమని ఈసందర్భంగా ముందుగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారత న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్య విశ్వాసానికి మూలస్థంభంగా నిలుస్తోందని పేర్కొన్నారు. అంతేగాక రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులన్నీటినీ రూల్ ఆఫ్ లా పరిరక్షిస్తోందని జస్టిస్ ఠాకూర్ గుర్తు చేశారు. రాజ్యాంగం ద్వారా అందించిన హక్కుల్లో అతి ముఖ్యమైనది ఓటు హక్కు అని దాని ద్వారా కోట్లాది మంది ప్రజలు వారికి నచ్చిన వ్యక్తిని నేతగా ఎన్నుకోవడం జరగుతోందని చెప్పారు. అంతేగాక విద్యా హక్కు,కనీస వేతన హక్కు వంటి వివిధ రకాల హక్కులు రాజ్యాంగం కల్పించడంతో ప్రజలకు అన్ని రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో క్షేత్రస్థాయి వరకూ గ్రామ పంచాయితీల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు.

రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగం నేడు ఒక లివింగ్ డాక్యుమెంట్ గా ఉందని రాజ్యాంగ గొప్పదనాన్నిప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. నేడు అనేక సవాళ్ల మధ్య మనం జీవిస్తున్నామని అయినప్పటికీ వాటన్నిటినీ అధికమించేందుకు మన రాజ్యాంగం మనకు అన్నివిధాలా తగిన శక్తిని,స్ఫూర్తిని అందిస్తోందని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగిన మన దేశంలో నెలకొన్న అసమానతలను రూపు మాపేందుకు అన్నివిధాలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా 8వేల 960 లీగల్ లిటరసీ అవగాహనా శిబిరాలు నిర్వహించడం ద్వారా పెద్దఎత్తున ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆనందదాయకమని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, కార్మిక వర్గాలకు చెందిన వివాదాలను సకాలంలో పరిష్కరించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు.

ఇంకా ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్, హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఘంటా రామారావు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జానకిరామి రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు వారి కుటుంబ సభ్యులు,పిపి నాగిరెడ్డి,పలువురు రిజిష్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ...

# విద్యుక్త ధర్మాన్ని సవ్యంగా నిర్వహించాలి

రాష్ట్ర సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సిఎస్ డా.కెఎస్.జవహర్ రెడ్డి



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రజా స్వామ్య విలువలను కాపాడుతూ వారి విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్విహిం చాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి పిలువునిచ్చారు.75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్క రించుకుని శుక్రవారం రాష్ట్ర సచివా లయం మొదటి భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ దేశం 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా అందరికీ శుభాభినందనలు తెలిపారు.భారత గణతంత్ర దినోత్సవ వేళ సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ వారివారి విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పునరుద్ఘాటించారు.1947లో దేశానికి స్వాతంత్రం వచ్చినా అప్పటికి మనకు రాజ్యాంగం లేక 1935 నాటి బ్రిటిష్ చట్టాన్ని అనుసరించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేస్తూ 1947 ఆగస్టు 29న రాజ్యాంగం నిర్మాణం కోసం డా.బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.1947 నవంబరు 4న కానిస్టిట్యుయెన్స్ అసెంబ్లీని ఏర్పాటు చేయగా 24 నెలల్లో రాజ్యాంగ ముసాయిదాను రూపొందించగా అది ఆమోదం పొంది 1950 జనవరి 26 నుండి భారత దేశం గణతంత్ర దేశంగా ప్రకటించబడి ఆనాటి నుండి మన భారత రాజ్యాంగం అమలు లోకి వచ్చిందని సిఎస్ జవహర్ రెడ్డి ఈసందర్భంగా గుర్తు చేశారు.

అంతేగాక 1950 జనవరి 24న మన జాతీయ గీతాన్నిఆమోదించడం జరిగిందని అదే విధంగా 1950 జనవరి 25న భారత ఎన్నికల కమీషన్ ఏర్పాటు అయిందని అందుకే ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోందని సిఎస్.జవహర్ రెడ్డి పేర్కొన్నారు. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం గానే కాకుండా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం వెలుగొందుతోందని,మన రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరునికి సమాన హక్కులను కల్పించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి పేర్కొన్నారు.రిపబ్లిక్ అంటే మనల్ని మనం పరిపాలించుకునే వ్యవస్థని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించు కోవడం ద్వారా తనకు నచ్చిన వారిని ఎన్నుకునే స్వేచ్ఛ స్వాతంత్యాన్ని రాజ్యాంగం కల్పించిందని అన్నారు.రాష్ట్రంలో పనిచేసే ప్రతి ఉద్యోగి మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేసి ప్రజలకు మెరుగైన రీతిలో పనిచేసి ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలు పేదలందరికీ సక్రమంగా అందేలా అన్ని విధాలా కృషి చేయాలని సిఎస్ జవహర్ రెడ్డి పిలువు నిచ్చారు.ఈకార్యక్రమంలో సచివాలయ ముఖ్య భద్రతాధికారి కె.కృష్ణమూర్తి,జిఏడి ఉప కార్యదర్శి రామసుబ్బయ్య, శ్రీనివాస్,సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటరామి రెడ్డి, ఎస్పిఎఫ్ ఇన్స్పెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, డా.కుమార్, పలువురు ఇన్స్పెక్టర్లుఇతర పోలీస్ సిబ్బంది,సచివాలయ అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ హౌస్ ఆవరణలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎపిఎస్ఆర్ టిసి ప్రధాన కార్యాలయం ఆర్టీసీ హౌస్ లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఇన్ ఛార్జ్ కమిషనర్ ఏపీ పీ టీ డీ పి ఎస్ ప్రద్యుమ్న పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ సంస్థ ఎం.డి విదేశీ పర్యటనలో ఉన్నందున ప్రభుత్వం ఇన్ ఛార్జ్ భాద్యతలు స్వీకరించి ఆర్టీసీలో జరుగుతున్న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావడం చాలా అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులందరికీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నో దశబ్దాల సేవలు : 1932 నుండి ఆర్టీసీ ప్రయాణికులకు వారి అభిరుచికి తగ్గట్టుగా బస్సులు ప్రవేశపెట్టి ఎప్పటికప్పుడు మెరుగైన రవాణా సౌకర్యం, సేవలు అందిస్తున్నదని, టెక్నాలజీని అందిపుచ్చుకుని మరింత ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందని తెలిపారు. రవాణా అనేది దేశ అభివృద్ధిలో కీలక అంశమని, ఏదైనా దేశం గానీ, రాష్ట్రం గానీ బాగా అభివృద్ధి చెందిందంటే, ఆ ప్రాంతంలో రవాణా సదుపాయం బాగుందని అర్థమని పేర్కొన్నారు. రవాణా అనగానే ప్రజలకు ఆర్టీసీ గుర్తుకు వస్తుందని, ప్రతి రోజూ దాదాపు 45 లక్షల మందిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ఏపిఎస్.ఆర్.టి.సి సేవలు మరచిపోలేనివని పేర్కొన్నారు.

నూతన టెక్నాలజీ డిజిటలైజేషన్ :. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బస్సుల రవాణా సౌకర్యం ఎన్నో రెట్లు పెరుగుతుందనీ, ఆర్టీసీకున్న ఫ్లీట్ లో ఎలక్ట్రిక్ బస్సులు మరింత వేగంగా పెంచుకోవడం అవసరమని, దశలవారీగా అన్ని డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశ పెట్టే దిశగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు ఛార్జింగ్ స్టేషన్, ప్రత్యేకమైన ఆపరేషన్ మానిటరింగ్ అవసరమని, ఎప్పుడైతే ఆర్టీసీ ఆ దిశగా ముందడుగు వేస్తుందో, మిగతా సెక్టార్లు కూడా ఆ దిశగా అడుగులు వేస్తాయని తెలిపారు.

నగదు రహిత సేవలు : డిజిటల్ పేమెంట్ మెకానిజం వలన దేశంలో ప్రగతి ఉంటుందని, ఆర్టీసీలో టిక్కెట్ల కొనుగోలు సమయాలలో ఈ విధానాన్ని పాటించడంవలన మరియు నగదు రహిత సేవలు విస్తృతం చేయడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. సామాన్య ప్రజలతో ఎక్కువగా మమేకమై ఉండే ఆర్టీసీలో నగదు రహిత సేవలు పెరిగితే సంస్థ ఆర్థికంగా వృద్ధి సాధిస్తుందని తెలిపారు.

కస్టమర్ ఎక్స్పీరియన్స్ / ప్రయాణీకుని ప్రయాణ అనుభూతి: ఇప్పటికే తిరుపతి, మదనపల్లి లాంటి కొన్ని చోట్ల ఎలక్ట్రిక్ బస్సులు మొదలయ్యాయని, రానున్న రోజుల్లో మరిన్ని బస్సులు రావడం వలన ప్రయాణికులు కూడా వారి ప్రయాణంలో కొత్త అనుభూతిని ఆస్వాదిస్తారని వివరించారు. ఆర్టీసీ సేవల పట్ల కస్టమర్ ఫీడ్ బ్యాక్, ప్రయాణీకుని సంతృప్తి చాలా ముఖ్యమైనవని - అధికారులు సర్వే చేయడం వలన ఈ విషయాలలో మరింతగా ఆర్టీసీ సేవలు మెరుగు పర్చుకోవచ్చని తెలిపారు.

0 యాక్సిడెంట్ రేటు : ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం ప్రధాన కర్తవ్యంగా డ్రైవర్లు అంకితభావంతో డ్యూటీలు చేయడం అభినందనీయమన్నారు. ప్రమాద రేటు నమోదు చేయడమే ధ్యేయంగా డ్రైవరు సోదరులు పని చేయాలని పిలువునిచ్చారు.

ప్రాణాలు పోతున్నా, అంకిత భావంతో విధులు:: విధి నిర్వహణలో గుండెపోటుకి గురైనా, ప్రయాణీకుల సంరక్షణే విధిగా, బస్సును పక్కకు ఆపి ప్రాణాలు విడిచిన అంకిత భావమున్న డ్రైవర్లు మన ఆర్టీసీలో ఉండడం గర్వించదగిన విషయమని తెలిపారు. ప్రయాణీకుల క్షేమం ముఖ్య విధిగా సేవలందించడం అభినందనీయమన్నారు. అదే విధంగా కండక్టర్లు మరియు గ్యారేజీ సిబ్బంది కూడా ప్రధాన భూమిక పోషిస్తున్నారని, ఉద్యోగ బాధ్యతల పట్ల ఉద్యోగస్తులందరి క్రమశిక్షణ, అంకితభావమే సంస్థ ఇప్పుడు ఈ స్థాయిలో ఉండటానికి ప్రధాన కారణమని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా: 2020 సంవత్సరం నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగులు మారినప్పటి నుండి ప్రభుత్వం సానుకూలంగా ఉండి వారికున్న ఒక్కో సమస్య తీర్చుకుంటూ వస్తుందని, సాధ్యమైనంతవరకూ మిగిలిన అన్ని సమస్యలు తీర్చేలా కృషి చేస్తామని వివరించారు.

ప్రయాణీకుల సంతృప్తే మనందరి అంతిమ ధ్యేయంగా మనమందరం కలసి పని చేద్దామని ఆయన పిలువునిచ్చారు. ఈ సందర్భంగా, సంస్థ ప్రగతిలో భాగస్వాములైన 24 మంది ప్రతిభని గుర్తించి, ప్రశంసించడం జరుగుతుందని తెలిపి, వివిధ విభాగాలలో ప్రతిభ చూపిన ఈ క్రింది ఉద్యోగులకు ఆపరేషన్స్ విభాగంలో 1. కె. మాధవ త్రినాథ్ 2. పి. శివాజీ 3. సీహెచ్. కె. ఎస్. మార్గరెట్ 2. మెకానికల్ విభాగంలో 1. టి. చంద్ర శేఖర్ 2. వై.నాగశేషు 3. వి. జగదీష్ 4. పి. వి. వి. ప్రసాద్ 5. కె. సుధాకర్ 6. ఎం. రోహిత్ 7. జి. విజయారత్నం 8. జె. వి. ఎ. ప్రసాద్ 9. జె. జె. వి. నాగ భూషణ రావు 10. ఏం. ఎస్. ఆర్. కృష్ణ

3. అక్కౌంట్స్ విభాగంలో- 1. డి .రీనా 2. పి. శ్రీనివాస రావు,

4. పర్సనల్ విభాగంలో 1. వై. వి. హరి కిశోర్ 2. ఎం . కె. శ్రీనివాస్ 3. ఎస్. పద్మావతి 4. జి. శ్రీనివాస రావు 5. సివిల్ విభాగంలో 1. ఎన్.ఎస్.ఎస్.వి. శర్మ 2. ఎస్. చంద్ర శేఖర్ రావు 3. జె. మాధవి లత 4. కె. సురేంద్ర 6. మెడికల్ విభాగంలో - డాక్టర్ కె. అమృతవల్లి లకు ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందజేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) కే.ఎస్.బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షత వహించిన ఈ వేడుకలలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కోటేశ్వరరావు, ఎఫ్. ఏ. సి. ఏ. ఓ ఎన్. వి. రాఘవ రెడ్డి, ఎ.డి (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ), శోభామంజరి, కృష్ణా రీజియన్ డీ పీ టీ ఓ ఎం.వై దానం, ఇంకా తదితర ఉన్నతాధికారులు, ఆర్టీసీ హౌస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన


కౌన్సిల్ చైర్మన్ మోషేన్ రాజు



అమరావతి , సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు.75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రజలందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. సుమరు 300 ఏళ్ళ పాటు బ్రిటిష్ వలస పానలకు చరమ గీతం పలికి సర్వసత్తాక ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించబడిన శుభదినం నేడని అన్నారు.నేడు పరిపాలన ఇంత సాఫీగా సాగుతోందంటే అందుకు మన రాజ్యాంగం దాని స్ఫూర్తే కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే దిశలో పాలన సాగడం చాలా ఆనందంగా ఉందని చైర్మన్ మోషేన్ రాజు అన్నారు.



# తెలుగునాట విరబూసిన పద్మాలు



**భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు మెగాస్టార్ చిరంజీవిలకు పద్మవిభూషణ్ దక్కగా పద్మశ్రీ విజేతలంతా నిరుపేద కుటుంబాల నుంచి వచ్చినా.. ఆయా కళల్లో అసాధారణ ప్రజ్ఞను ప్రదర్శించి సమాజాన్ని మెప్పించారు. వారి నేపథ్యాలను ఓసారి పరిశీలిద్దాం.**

## సినీజగత్తులో సుప్రీమ్ హీరో చిరంజీవి


కృషి ఉంటే మనుషులు రుషులే కాదు..చిరంజీవి కూడా అవుతారని తన ప్రయాణంతో చాటి చెప్పాడు శివశంకర వరప్రసాద్. చదువుకునే వయసులోనే హీరో కావాలని కల కన్నాడు ఒక్కడే ప్రయాణం మొదలుపెట్టాడు. చిరంజీవిగా పేరు మార్చుకుని తనని తాను ఆవిష్కరించుకుంటూ అంచెలంచెలుగా ఎదిగాడు. నంబర్ వన్ అనిపించుకున్నాడు. తనతోపాటే చిత్రసీమ స్థాయినీ పెంచాడు. చిత్రసీమలో ఏ పది మందిని పలకరించినా సరే, చిరంజీవిలా డ్యాన్స్ చేయాలని, ఆయనలా నటించాలని, ఆయనలా స్వయంకృషితో ఎదగొచ్చనే ధైర్యంతో వచ్చామనే సమాధా నమే వినిపిస్తుంది. శిఖరం ఎక్కడమే కాదు. శిఖరాగ్రానికి చేరాక తొణకకుండా బెణకకుండా ఆ స్థానంలో నిలిచి చూపిన ఘనత చిరంజీవికి దక్కుతుంది. కొత్తతరం వచ్చినా..సినిమాలకి దాదాపు పదేళ్లు దూరంగా ఉన్నా ఆయన ఇమేజ్ మచ్చుకైనా తగ్గలేదు. ఆయనలో సేవాగుణం మరింత వన్నె తీసుకొచ్చింది. నాలుగున్నర దశాబ్దాలుగా సినీ రంగంలో ఆయన కృషి, ఆయన సేవా గుణమే దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ గౌరవానికి కారణమైంది. అక్కినేని నాగేశ్వరరావు తర్వాత ఈ గౌరవం దక్కిన తెలుగు నటుడు చిరంజీవి. : 2006లోనే భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించిన చిరంజీవి అదే ఏడాదిలోనే ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌ని అందుకున్నారు. 2016లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని అందుకున్నారు. 'స్వయం కృషి', 'ఆపద్బాంధవుడు', 'ఇంద్ర' చిత్రాలకిగానూ ఉత్తమ నటుడిగా నంది పురస్కారాలు సొంతం చేసుకున్నారు. 2022లో భారత ప్రభుత్వం నుంచి ఇండియన్ ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ పురస్కారం చిరంజీవికి దక్కింది. 1987లో ప్రఖ్యాత ఆస్కార్ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆహ్వానం అందుకున్నారు. మదర్ థెరిస్సా స్ఫూర్తితో 1998లో చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌ని ఏర్పాటు చేసిన చిరంజీవి రక్తదానం, నేత్రదానం దిశగా అభిమానుల్ని నడిపించారు. కరోనా మహమ్మారి సమయంలో చిత్రసీమ స్తంభించిపోవడంతో కార్మికుల్ని ఆదుకోవడం కోసం సీసీసీ సంస్థని ఏర్పాటు చేసి విరాళాల్ని సేకరించి సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2008లో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి ఆ తర్వాత కాంగ్రెస్‌లో విలీనం చేశారు చిరంజీవి. 2012 నుంచి ఆరేళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2012– 2014 వరకూ మన్మోహన్ సింగ్ మంత్రి వర్గంలో కేంద్ర పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా సేవలు అందించారు



## అందరికీ ఇష్టుడు...అజాతశత్రువు

### తెలుగువారి ఠీవి.. వెంకయ్యనాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించింది. విద్యార్థి రాజకీయాల నుంచి ఉపరాష్ట్రపతి దాకా సుదీర్ఘకాలం దేశ ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ను దేశ అత్యున్నత రెండో పౌరపురస్కారానికి ఎంపిక చేసింది. 75 ఏళ్ల వెంకయ్యనాయుడు తన 46 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేగా, బీజేపీ రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతిగా విభిన్నహోదాల్లో పనిచేశారు. అనుపమాన వాగ్ధాటితో ఆసేతుహిమాచలం అభిమానధనాన్ని సొంతం చేసుకున్న తెలుగునేత ఈయనే. దేశంలో ఉన్న అన్ని జిల్లాలనూ కనీసం ఒక్కసారైనా చుట్టేసి ఈ దేశం మట్టివాసనను ఆఘ్రాణించిన బహుదూరపు బాటసారి కూడా. 2017 నుంచి 2022 మధ్యకాలంలో భారత 13వ ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన వెంకయ్యనాయుడు వాజ్‌పేయీ ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగానూ పనిచేశారు. 2014 నుంచి 2017 వరకు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గంలో పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్రంలో భాజపా అధికారంలో ఉన్నప్పుడు 2002 నుంచి 2004 మధ్యకాలంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా గ్రామీణ వేష, భాషలను వీడని వ్యక్తిత్వం వెంకయ్యనాయుడు ప్రత్యేకం. ప్రతి మాటలో, చేతలో కనిపించే సరళత, సౌమ్యత, స్పష్టత ఆయన్ను విశిష్టవ్యక్తిగా నిలిపాయి. సుదీర్ఘ రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప ఎవ్వరితోనూ వ్యక్తిగత విభేదాలు లేని అజాతశత్రువు. ప్రతిపక్షాల నుంచి కూడా గౌరవం పొందిన కొద్దిమంది నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ మంత్రి హోదాలో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే అత్యధికంగా పట్టణ పేదల ఇళ్లు మంజూరుచేసి స్వరాష్ట్రం పట్ల ఉన్న ప్రేమను చాటుకున్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, కాకినాడలను స్మార్ట్‌సిటీల జాబితాలో చేర్చి అక్కడ మౌలికవసతుల మెరుగుదలకు కేంద్రం నుంచి సాయం అందేలా చేశారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో డ్రైనేజీ సౌకర్యం మెరుగుదల కోసంమెరుగుదల, అమరావతి నగర మౌలిక సదుపాయాల కోసం రూ.1,500 కోట్లు మంజూరుచేసి రాష్ట్రానికి తనవంతు చేయూతనిచ్చారు. ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో విభజన చట్టంలోని హామీల అమలు కోసం నిరంతరం అధికారులతో మాట్లాడుతూ వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేశారు. వీలున్నచోటల్లా మాతృభాష, మాతృరాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వడానికి తనవంతు కృషి చేశారు. . ఈ ఏడాది ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తుల్లో పద్మ విభూషణ్ పురస్కారం దక్కింది ఈయన ఒక్కరికే.



## ఉమామహేశ్వరి



పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మనోళ్లు పేదరికంలో పుట్టినా తమ రంగాల్లో నిష్ణాతులుగా మారారు. వివిధ కళల్లో గుర్పింపు తెచ్చుకున్నారు. ఉమామహేశ్వరి పుట్టింది ఆంధ్రప్రదేశ్ లో.. పెరిగింది తెలంగాణలో. మచిలీట్నంలోని ఉమామహేశ్వరి తెలంగాణ లోని వేములవాడలో ఆమె పుట్టారు. హరికథ అంటే చిన్నప్పుటి నుంచే ఆసక్తి ఉన్న ఉమామహేశ్వరి తండ్రి లాలాజీరావు నాదస్వర విద్వాంసుడు కావడంతో సహజంగానే కళల పట్ల ఉత్సుకత పెరిగింది. ఆయన వేములవాడ దేవస్థానంలో ఆస్థాన విద్వాంసుడిగా ముప్ఫయి ఏళ్లకు పైగా పని చేశారు. పదో తరగతి వరకూ చదివిన ఉమామహేశ్వరి సంగీతంపై ఉన్న ఆసక్తితో హరికథ నేర్చుకోవాలని భావించి అందులో శిక్షణ పొందారు. రుక్మిణి కల్యాణం హరికథా గానంతో తొలి ప్రదర్శన ఇచ్చిన ఉమామహేశ్వరి అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. హరికథకు దక్కిన గౌరవంగా ఆమె తెలిపారు.



## గడ్డం సమ్మయ్య



జనగామ జిల్లాలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్య నిరుపేద కుటుంబంలో జన్మించారు. తండ్రి నుంచి వారసత్వంగా చిందు యక్షగానాన్ని నేర్చుకున్నారు. ఐదో తరగతి మాత్రమే చదివిన సమ్మయ్య తన 12వ ఏట నుంచే రంగస్థలంపై అడుగుపెట్టి.. సమాజాన్ని అలరించారు. పురాణ గాథలకే పరిమితం కాకుండా.. పలు సామాజిక అంశాల ఆధారంగా ప్రదర్శనలు ఇచ్చి సమాజాన్ని చైతన్యవంతం చేశారు. ఇటీవల అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా రామాయణంపై యక్షగాన ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.



## కూరెళ్ల విఠలాచార్య



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేట మండలం వెల్లంకి నివాసి కూరెళ్ల విఠలాచార్యకు పుస్తకాలంటే పిచ్చి. ఏ పుస్తకం కనిపించినా వదలకుండా తన ఇంటికి చేరుస్తారు. 2014లో ఆయన తన ఇంటిని గ్రంథాలయంగా మార్చారు. ఆయన కవి కూడా. 2 లక్షల పుస్తకాలను సమకూర్చి తన లైబ్రరీలో పెట్టారు. విద్యార్థులకు ఈయన ఇల్లు ఒక వరంలా మారింది. ఎందరికో పీహెచ్‌డీ చేసేందుకు ఈ లైబ్రరీ ఉపయోగపడింది. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.



## దాసరి కొండప్ప




బుర్రవీణతో మన సంస్కృతిని చాటుతూ సమాజాన్ని రంజింపజేస్తున్న దాసరి కొండప్పను భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం వరించింది. నారాయణపేట జిల్లా దామంగిద్దకు చెందిన కొండప్ప.. వెదురు కర్ర, సొరకాయ, చెక్కమెట్టు ద్వారా అరుదైన బుర్రవీణను తయారు చేసుకున్నారు. ఇలాంటి 12 మెట్ల వాయిద్యం మరెవరి దగ్గరా లేకపోవటం విశేషం. కూలి చేసుకొని బతుకుతున్న కొండప్ప.. ఎవరైనా చనిపోయినప్పుడు తత్వాలు, ఇతర ఉత్సవాల్లో మన పురాణగాథలు చెబుతారు. భార్య, ఓ కుమరుడు చనిపోయినా ఆయన ఈ కళను వదలలేదు.



## వేలు ఆనందాచారి




ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లిలో పుట్టి హైదరాబాద్‌లో స్థిరపడిన వేలు ఆనందాచారి 1980లో దేవాదాయ శాఖలో స్థపతిగా చేరారు. నాటి నుంచి తెలుగునేలపై అనేక ఆలయాలకు రూపకల్పన చేశారు. రిటైర్ అయిన తర్వాత కూడా శ్రీశైల దేవస్థానంలో ఆయన ఆస్థాన స్థపతిగా సేవలందిస్తున్నారు. యాదాద్రి పునర్నిర్మాణంలో ఈయన సేవలకు మెచ్చి యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థ ఈయనను ప్రధాన స్థపతిగా నియమించింది. శిల్ప కళారంగంలో ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈ ఏడాదికి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.



## కేతావత్ సోమ్‌లాల్



యాదాద్రి భువనగిరి జిల్లా ఆకుతోట బావి తండాకు చెందిన కేతావత్ సోమ్‌లాల్ నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తూ బంజారాలను చైతన్య పరచే అనేక పాటలు రచించారు. సుమారు 16 నెలలు శ్రమించి, 2014లో ఈయన భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించారు. ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది. ఆయన సాహిత్యసేవను గుర్తించిన కేంద్రం.. ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది





# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెన్‌సేషన్... జకోవిచ్ ఔట్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024లో మరో సంచలనం నమోదైంది. ఇప్పటికే నంబర్ 2 ర్యాంకర్ అల్కరాస్ క్వార్టర్ ఫైనల్లోనే ఓటమిపాలైన సంగతి తెలిసిందే. తాజాగా టెన్నిస్ స్టార్, వరల్డ్ నంబర్వన్ నొవాక్ జకోవిచ్ కూడా ఇంటిముఖం పట్టాడు. సెమీస్లో ఇటలీకి చెందిన యువ ప్లేయర్ జనిక్ సినర్ చేతిలో జకో ఓటమిపాలు కావడం గమనార్హం. నాలుగో ర్యాంకర్ అయిన సినర్ తన కెరీర్లో తొలిసారి గ్రాండ్స్లామ్ ఫైనల్కు చేరుకున్నాడు. మరో సెమీస్లో మెద్వెదెవ్ - జెరెవ్లో ఎవరు గెలిస్తే వారితో సినర్ టైటిల్ కోసం పోటీపడతాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ ఆదివారం జరగనుంది. సెమీస్లో జకోవిచ్ వరుసగా తొలి రెండు సెట్లను 1-6, 2-6 తేడాతో సినర్కు కోల్పోయాడు. మూడో సెట్లో మాత్రం తీవ్రంగా పోరాడిన జకోవిచ్ 7-6 (8/6)తో రేసులో నిలిచాడు. కానీ, ఈ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. నాలుగో సెట్లో సినర్ విజృంభించాడు. జకోను బ్రేక్ చేసిన సినర్ 6-3తో సెట్ను సొంతం చేసుకోవడంతోపాటు ఫైనల్కు చేరుకున్నాడు. ఈ మ్యాచ్లో జకోవిచ్ నాలుగు డబుల్ ఫాల్ట్స్ చేయగా.. సినర్ ఒక్కసారి మాత్రమే చేశాడు.



# ఆధిపత్యం ప్రదర్శిస్తున్న భారత్

## ముగిసిన రెండో రోజు ఆట..

● ఇంగ్లాండ్‌పై భారత్ 175 పరుగుల ఆధిక్యం ● రాణించిన రాహుల్,యశస్వి, జడేజా

హైదరాబాద్ : హైదరాబాద్లోని ఉప్పల్ మైదానం వేదికగా భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండోరోజు ఆట ముగిసింది. మొదటి ఇన్నింగ్స్లో ఇంగ్లాండ్పై భారత్ 175 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. ఓవర్నైట్ 119/1 స్కోరుతో రెండో రోజు ఇన్నింగ్స్ను కొనసాగించిన భారత్ ఆట ముగిసే సమయానికి 421/7 స్కోరుతో నిలిచింది. క్రీజ్లో రవీంద్ర జడేజా (81★), అక్షర్ పటేల్ (35★) ఉన్నారు. కేఎల్ రాహుల్ (86), యశస్వి జైస్వాల్ (80)తో పాటు హాఫ్ సెంచరీలు సాధించారు. శ్రీకర్ భరత్ (41), శ్రేయస్ అయ్యర్ (35), రోహిత్ శర్మ (24), శుభ్మన్ గిల్ (23) ఫర్వాలేదనిపించారు. రవిచంద్రన్ అశ్విన్ (1) విఫలమయ్యాడు. ఇంగ్లాండ్ బౌలర్లు టామ్ హార్ట్లే 2, జో రూట్ 2.. జాక్ లీచ్, రెహాన్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు ఇంగ్లాండ్ తన తొలి ఇన్నింగ్స్లో 246 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

**నాలుగో బంతికే జైస్వాల్ ఔట్..**

తొలి రోజు చివరి సెషన్లో ఇంగ్లాండ్కు బజ్బాల్ రుచి చూపించిన యశస్వి జైస్వాల్ అదే దూకుడు కొనసాగించేందుకు ప్రయత్నించా డు. అనూహ్యంగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఇవాళ తొలి ఓవర్నే పార్ట్ టైమ్ స్పిన్నర్ జో రూట్తో వేయించాడు. అది సత్ఫలితం ఇచ్చింది. రెండో బంతిని బౌండరీకి తరలించిన జైస్వాల్ అదే ఊపులో నాలుగో బంతికి భారీ షాట్కు యత్నించాడు. చివరికి బౌలర్ రూట్కే క్యాచ్ ఇచ్చి పెవిలియన్కు చేరాడు. కాసేపటికే శుభ్మన్ గిల్ కూడా వికెట్ సమర్పించాడు. అనవసర షాట్కు వెళ్లి హార్ట్లేకి వికెట్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్తో శ్రేయస్ అయ్యర్ ఐదో వికెట్కు 64 పరుగులు జోడించాడు. అయ్యర్ కూడా ఓ చెత్త షాట్కు తన వికెట్ను ఇచ్చేశాడు.

**నిలబడిన ఆల్రౌండర్లు**

ఓ వైపు వికెట్లు పడినా.. కేఎల్ రాహుల్ మాత్రం అర్ధశతకం సాధించి నిలకడైన ఆటతీరు ప్రదర్శించాడు. ఆరంభంలో రవీంద్ర జడేజా ఆచితూచి ఆడాడు. కుదురుకున్నాక బ్యాట్ను ఝుళిపించడం ప్రారంభించాడు. సెంచరీ చేస్తాడని అనుకున్న సమయంలో కేఎల్ రాహుల్ పెవిలియన్కు చేరాడు. అప్పటికి భారత్ స్కోరు 288/5. ఆధిక్యం 40+ మాత్రమే. అప్పుడే జడ్డూతో కలిసి



యువ వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆరో వికెట్కు 68 పరుగులు జోడించారు. భరత్ తన కెరీర్లో తొలి హాఫ్ సెంచరీని సాధిస్తాడని అంతా భావించారు.

మరోసారి బౌలింగ్కు వచ్చిన జో రూట్ వికెట్ తీశాడు. అశ్విన్ అలా వచ్చి రనౌట్ రూపంలో పెవిలియన్కు వెళ్లాడు. బ్యాటర్గా చివర ఉన్న ఏకైక ఆటగాడు అక్షర్ పటేల్. జడ్డూతో కలిసి అతడు మరో వికెట్ పడనీయకుండా రోజును ముగించాడు. వీరిద్దరూ 8వ వికెట్కు ఇప్పటికే 63 పరుగులు జోడించారు. మూడో రోజు ఉదయం ఇంకాస్త సమయం క్రీజ్లో ఉంటే భారత్ ఆధిక్యం 200 దాటడం పెద్ద కష్టమేమీ కాదు.




## భారత్ కోసం పాకిస్థాన్‌కు షాకిచ్చిన రషీద్ ఖాన్!

అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్ పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు షాకిచ్చాడు. ఫిబ్రవరిలో ప్రారంభంకానున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)కు అందుబాటులో ఉండట్లేదని రషీద్ ఖాన్ ప్రకటించాడు. ఐర్లాండ్తో సిరీస్ పాటు భారత్ నిర్వహించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ ప్రారంభం కాకముందే పీఎస్ఎల్ లీగ్ ముగిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ పనిభారం తగ్గించుకోవడం కోసం పాక్ లీగ్ను రషీద్ పక్కనపెట్టినట్లు సమాచారం. మరోవైపు పీఎస్ఎల్లో స్టార్ ఆల్రౌండర్ రషీద్ ఖాన్ లేడనే వార్త పాక్ అభిమానులను అసంతృప్తికి గురిచేస్తోంది. ఎందుకంటే గత మూడు సీజన్లలో లాహోర్ క్వాలండర్స్ తరఫున రషీద్ అదరగొట్టాడు. 2022, 2023 సీజన్లలో ఆ జట్టు టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. కానీ 2024 సీజన్లో అతడు లేకపోవడం లాహోర్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. వన్డే ప్రపంచకప్ అనంతరం రషీద్ ఖాన్ క్రికెట్కు దూరమయ్యాడు. వెన్ను గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఇటీవల టీమిండియాతో టీ20 సిరీస్కు అతడు ఎంపికైనప్పటికీ ఫిటెనెస్ సాధించకపోవడంతో బెంచ్కే పరిమితమయ్యాడు. ఇప్పుడిప్పుడే పూర్తి ఫిట్నెస్ సాధిస్తున్నాడు. ఈ ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ దృష్టిలో పెట్టుకొని పనిభారం గురించి రషీద్ జాగ్రత్త పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే పాక్ లీగ్ కంటే ఐపీఎల్తోనే ఆట, అనుభవాన్ని ఎక్కువగా సంపాదించుకోవచ్చనే ఉద్దేశంతో పాకిస్థాన్కు రషీద్ నో చెప్పినట్లు తెలుస్తోంది. ఐపీఎల్లో రషీద్ గుజరాత్ టైటాన్స్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, దుబాయ్ వేదికగా అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ల ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18వరకు ఈ మ్యాచ్లు కొనసాగనున్నాయి. టెస్టు ఆరంభానికి ఫిట్నెస్ సాధించకపోయినా వన్డే, టీ20లకు అందుబాటులో ఉండాలే రషీద్ శ్రమిస్తున్నాడు.

# వ్యక్తిగత రికార్డులు ఎందుకు పనికిరావు

## రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు



వ్యక్తిగత రికార్డుల కోసం కాకుండా జట్టు విజయం కోసం ఆడటం ముఖ్యమని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ప్రపంచకప్ విజయం లేకుండా శతకాలు, రికార్డులు సాధించడం అనవసరమని అభిప్రాయపడ్డాడు. రికార్డులు, శతకాలు అన్ని అతిగా గుర్తించబడుతాయని తెలిపాడు. ఐదు టెస్టు సిరీస్లో భాగంగా ఇంగ్లండ్తో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ నేపథ్యంలో రోహిత్ శర్మ అధికారిక బ్రాడ్కాస్టర్ జియో సినిమాతో మాట్లాడాడు. వెటరన్ క్రికెటర్ దినేశ్ కార్తీక్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో రికార్డులు, అంకెలు చాలా చిన్నవని రోహిత్ అభిప్రాయపడ్డాడు. 2019 వన్డే ప్రపంచకప్లో తాను 5 శతకాలు నమోదు చేశానని, కానీ చివరకు ఓటమే ఎదురైందని తెలిపాడు. ఈ క్రమంలోనే తాను పూర్తిస్థాయి కెప్టెన్సీ బాధ్యతలు అందుకోగానే.. నెంబర్స్ కోసం కాకుండా స్వేచ్ఛగా ఆడేలా మార్పు తీసుకురావాలనుకున్నానని చెప్పుకొచ్చాడు. 'నేను జట్టులో ఒక నిర్దిష్ట మార్పు తీసుకురావాలనుకున్నా. ఆటగాళ్లంతా మైదానంలోకి వెళ్లి స్వేచ్ఛగా ఆడేలా చేయాలనుకున్నా. గణంకాలతో కూడిన క్రికెట్ను పక్కనపెట్టాలనుకున్నాను. జనాలు క్రికెట్ రికార్డ్స్, వ్యక్తిగత గణంకాలను చూడటం లేదు. కేవలం ఆటను మాత్రమే ఆస్వాదిస్తున్నారు. గణంకాలు ఎప్పుడూ అతిగా అంచనవేయబడుతాయి. భారత్లో క్రికెట్ రికార్డ్స్, సెంచరీల గురించి ఎక్కువ మాట్లాడుతారు. అయితే 2019 వన్డే ప్రపంచకప్లో నేను 5 సెంచరీలు సాధించాను. కానీ ఏమి జరిగింది? మేం ఓడిపోయాం. మూడు ఫార్మాట్లలో జట్టుకు సారథ్యం వహించడం కాస్త ఇబ్బంది కలిగించే అంశమే.

అయితే కోర్ గ్రూప్లో ఒకడిగా ఉంటే మూడు ఫార్మాట్లలో జట్టును నడిపించడం పెద్ద కష్టం కాదు. కెప్టెన్గా బాధ్యతలను స్వీకరించిన తర్వాత కష్టమైనా భరించాలి. భారత కెప్టెన్గా అవకాశం వచ్చినప్పుడు నేను చాలా ఉత్సాహంగా ఫీలయ్యాను. గత 7-8 ఏళ్లుగా నేను కోర్ గ్రూప్లో భాగంగా ఉన్నాను. వైస్ కెప్టెన్గా కీలక నిర్ణయాల్లో భాగమయ్యాను. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో కొన్ని మ్యాచ్లో సారథ్యం కూడా వహించాను.దేశానికి సారథ్యం వహించడం గొప్ప గౌరవం. ఎంతో మంది దిగ్గజ సారథులను చూస్తూ పెరిగిన నేను.. వారి సరసన నిలిచే అవకాశం దక్కడం గొప్పగా ఉంది. ఇది గొప్ప అవకాశం కూడా'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# వన్డేల్లో భారత్ తరఫున హ్యాట్రిక్ సాధించిన నలుగురు బౌలర్లు








కపిల్ దేవ్, బిషన్ సింగ్ బేడీ, జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో పేరు సంపాదించారు. ఈ బౌలర్లు తమ పేరిట ఎన్నో రికార్డులు సృష్టించారు. చాలా మంది బౌలర్లు తమ పేరిట హ్యాట్రిక్ వికెట్లు కూడా తీశారు. హ్యాట్రిక్ తీయడం అంత తేలికైన విషయం కాదు. కానీ, ఇప్పటి వరకు చాలా మంది భారత బౌలర్లు హ్యాట్రిక్ వికెట్లు తీశారు. ముఖ్యంగా వన్డేలో హ్యాట్రిక్ సాధించిన నలుగురు భారత బౌలర్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. వన్డేల్లో భారత్ తరఫున హ్యాట్రిక్ సాధించిన నలుగురు బౌలర్లు: భారత క్రికెట్ జట్టు ఇప్పటి వరకు ఎన్నో విజయాలు సాధించింది. ఈ కాలంలో చాలామంది ఆటగాళ్లు తమ పేరిట ఎన్నో రికార్డులు సృష్టించారు. భారత్ను ఎప్పుడూ బ్యాట్స్మెన్ల కోటగా పరిగణిస్తారు. సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, మహ్మద్ అజారుద్దీన్, రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి దిగ్గజాలు ఇక్కడి నుంచి వెలుగులోకి వచ్చారు. అయితే, ఎప్పటికప్పుడు భారత జట్టుకు గొప్ప బౌలర్లు పుట్టుకొస్తూనే ఉన్నారు.

1. చేతన్ శర్మ..

వన్డేల్లో భారత్ తరఫున తొలి హ్యాట్రిక్ సాధించిన రికార్డు చేతన్ శర్మ పేరిట ఉంది. 1987 ప్రపంచకప్ సందర్భంగా నాగ్పూర్లో న్యూజిలాండ్పై అతను ఈ ఘనత సాధించాడు. ఈ హ్యాట్రిక్ సమయంలో కేన్ రూథర్ఫోర్డ్, ఇయాన్ స్మిత్, ఎవెన్ చాట్ఫీల్డ్లను అవుట్ చేశాడు.

చేతన్ శర్మ తన వన్డే కెరీర్లో మొత్తం 65 మ్యాచ్లు ఆడాడు. ఈ సమయంలో అతను 67 వికెట్లు పడగొట్టాడు. 22 పరుగులకు 3 వికెట్లు పడగొట్టడం అతని అత్యుత్తమ ప్రదర్శన.

2. కపిల్ దేవ్..

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ 1991లో ఈడెన్ గార్డెన్స్లో శ్రీలంకపై హ్యాట్రిక్ సాధించాడు. రోషన్ మహానామ, రమేష్ రత్నాయకే, సనత్ జయసూర్యలను ఔట్ చేయడం ద్వారా హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఆ సమయంలో వన్డేల్లో హ్యాట్రిక్ సాధించిన రెండో భారత బౌలర్. కపిల్ దేవ్ తన వన్డే కెరీర్లో 225 వన్డే మ్యాచ్లు ఆడి 253 వికెట్లు తీశాడు. 43 పరుగులకు 5 వికెట్లు పడగొట్టడం అతని అత్యుత్తమ ప్రదర్శన.

3. కుల్దీప్ యాదవ్..

రెండుసార్లు హ్యాట్రిక్ సాధించిన ఏకైక భారత బౌలర్ కుల్దీప్ యాదవ్. ముందుగా 2017లో ఈడెన్ గార్డెన్స్లో ఆస్ట్రేలియాపై హ్యాట్రిక్ వికెట్ తీశాడు. అతను వరుసగా 3 బంతుల్లో మాథ్యూ వేడ్, అష్టన్ అగర్, పాట్ కమిన్స్లను అవుట్ చేశాడు. దీని తర్వాత, 18 డిసెంబర్ 2019న విశాఖపట్నంలో వెస్టిండీస్పై కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్ వికెట్ తీశాడు. షాయ్ హోప్, జాసన్ హోల్డర్, అల్జారీ జోసెఫ్లను వరుస బంతుల్లో అవుట్ చేయడం ద్వారా కుల్దీప్ తన రెండో హ్యాట్రిక్ పూర్తి చేశాడు.

4. మహ్మద్ షమీ..

2019 ప్రపంచకప్లో ఆఫ్ఘనిస్తాన్పై మహ్మద్ షమీ హ్యాట్రిక్ వికెట్ తీశాడు. అతను మహ్మద్ నబీ, అఫ్తాబ్ ఆలం, ముజీబ్ ఉర్ రెహమాన్లను తొలగించాడు. అతని అద్భుత ఆటతీరుతో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్లో భారత జట్టు విజయం సాధించింది.




# 19 భారత్ ఘన విజయం




అండర్ 19 ప్రపంచకప్ 2024లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఉదయ్ శరణ్ సారథ్యంలోని యంగ్ ఇండియా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఐర్లాండ్తో గురువారం జరిగిన మ్యాచ్లో 201 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ముషీర్ ఖాన్(106 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సలతో 118) విధ్వంసకర శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ -19 టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 301 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముషీర్ ఖాన్కు తోడుగా కెప్టెన్ ఉదయ్ శరణ్(84 బంతుల్లో 5 ఫోర్లతో 75) హాఫ్ సెంచరీతో రాణించాడు. తెలుగు తేజం అరవెల్లీ అవినాష్(13 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సో 22) మెరుపులు మెరిపించాడు. ఐర్లాండ్ల బౌలర్లలో ఓలివర్ రిలీ మూడు వికెట్లు తీయగా.. జాన్ మెక్ నాల్లీ రెండు వికెట్లు పడగొట్టాడు. ఫిలుట్టన్కు ఓ వికెట్ దక్కింది. అనంతరం లక్ష్యచేధనకు దిగిన ఐర్లాండ్ల 29.4 ఓవర్లలో 100 పరుగులకు కుప్పకూలింది. డానియెల్ ఫోర్కిన్(27 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో నమాన్ తివారీ 4 వికెట్లు తీయగా.. సౌమి పాండే 3 వికెట్లు పడగొట్టాడు. ధనుష్ గౌడ, మురుగణ్ అభిషేక్, ఉదయ్ శరణ్ తలో వికెట్ తీసారు. తొలి మ్యాచ్లో బంగ్లాదేశ్ను 84 పరుగులతో మట్టికరిపించిన భారత్.. 4 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## షోయబ్ మాలిక్‌కు బ్యాడ్ టైమ్ - ఫిక్సింగ్‌తో కాంట్రాక్ట్ రద్దు



పాకిస్తాన్ సీనియర్ క్రికెటర్ షోయబ్ మాలిక్ కు ఓ రేంజ్ లో బ్యాడ్ టైమ్ నడుస్తోంది. ఇప్పటికే వరుస వైఫల్యాలతో అన్ని ఫార్మాట్లలోనూ జాతీయ జట్టులో చోటు కోల్పోయిన మాలిక్కు తాజాగా సానియా మీర్జాతో విడాకుల వ్యవహారం చికాకు పెడుతూనే ఉంది. అదే సమయంలో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో ఆడుకుందామని భావించిన మాలిక్ పై ఫిక్సింగ్ ఆరోపణలు వచ్చాయి. దీంతో అతని కాంట్రాక్ట్ రద్దు చేస్తూ లీగ్ ఫ్రాంచైజ్ నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో పాకిస్తాన్ ఆల్ రౌండర్ షోయబ్ మాలిక్... ఫార్చ్యూన్ బరిషల్ జట్టు తరఫున ఆడుతున్నాడు. అయితే తాజాగా ఫార్చ్యూన్ బరిషల్ జట్టుతో కలిసి మూడు మ్యాచ్లు ఆడిన మాలిక్ వ్యక్తిగత కారణాలు చూపుతూ దుబాయ్కి తిరిగి వచ్చాడు. దీంతో మాలిక్ పై ఫిక్సింగ్ అనుమానాలు మొదలయ్యాయి. దీంతో ఫార్చ్యూన్ బరిషల్ జట్టు మాలిక్ కాంట్రాక్టును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

